జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | శనివారం 14 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :291 | పేజీలు : 12 | వెల : 3/-

PRGI No. APTEL/26/A0119,

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏజెన్సీ/కరస్పాండెంట్ ఇంటర్వ్యూలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

సంవత్సరం: శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: ఆశ్వయుజ మాసం ఋతువు: శరద్ ఋతువు ఆయనం: దక్షిణాయణం విశేషం: అమావాస్య, దీపావళి, నరక చతుర్దశి, లక్ష్మీ పూజాసూర్యోదయం: 6.03 సూర్యాస్తమయం: 5.19 చంద్రోదయం: 5.49 చంద్రాస్తమయం: 4.46 తిథి: బహుళ చతుర్దశి ఉ. 10.26 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: స్వాతి పూర్తిగా ఉంది యోగం: ఆయుష్మాన్ తె. 3.44 వరకు, తదుపరి సౌభాగ్యం కరణం: శకుని ఉ. 10.26 వరకు, తదుపరి చతుష్పాదం రా. 10.43 వరకు, తదుపరి నాగం

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com



ప్రపంచ దేశాల చూపు బ్రహ్మోస్‌పైనే!

- ఫిలిప్పీన్స్, వియత్నాం బాటలో మరిన్ని దేశాలు..
- క్షిపణుల కొనుగోలుకు ఆసక్తి
- ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన అంతర్జాతీయ డిమాండ్..
- ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూపులు



పోర్టుల అనుసంధానంతో ఏపీ అభివృద్ధికి కొత్త ఊతం!

- రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాల విస్తరణకు పలు కారిడార్లు: నితిన్ గడ్కరీ
- పోర్టులను అనుసంధానిస్తూ రహదారుల నిర్మాణం
- రాయ్‌పూర్--విశాఖ కారిడార్ 96 శాతం పూర్తి
- అమరావతి చుట్టూ 192 కి.మీ. రింగ్‌రోడ్డు ప్రతిపాదన
- బెంగళూరు-విజయవాడ కారిడార్‌తో 110 కి.మీ. దూరం తగ్గింపు

విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అభివృద్ధిలో పోర్టులు కీలక పాత్ర పోషించనున్నాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానించడం ద్వారా ఎగుమతులు, దిగుమతులకు అవసరమైన రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఏపీని ఇతర రాష్ట్రాలతో అనుసంధానించే రహదారులు, గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని - మిగతా 3లో



బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడితే.. పేరు ఇదే.. 'అక్వాన్'!

- బంగాళాఖాతంలో ఈ నెల 18 నాటికి తుపాను ఏర్పడే అవకాశం
- తుపానుగా మారితే ఇరాన్ ప్రతిపాదించిన 'అక్వాన్' పేరు ఖరారు
- దక్షిణ అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

భవిష్యత్ సాంకేతికతపై ప్రత్యేక దృష్టి



- పెట్టుబడుల వెల్లువ.. 303 ఒప్పందాలు!
- రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు.. 3.48 లక్షల ఉద్యోగాలు
- ఘనంగా ముగిసిన విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- 2024 జూన్ నుంచి రూ.32.49 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు
- ఎంఓయూల అమలుపై ఏటా ఆడిట్ నివేదికలు: సీఎం చంద్రబాబు
- అమరావతిని క్వాంటం కంప్యూటర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన

విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ఘనంగా ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మొత్తం 303 ఒప్పందాల ద్వారా రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు, 3,48,309 ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రతిపాదనలు వచ్చినట్లు వెల్లడించారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి వచ్చిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల విలువ రూ.32.49 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. సదస్సు ముగింపు కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. విశాఖ పెట్టుబడుల - మిగతా 3లో

శాస్త్రీయ అభివృద్ధికి మైసూరు రాజకుటుంబం కృషి



- విజ్ఞానం.. ఆధ్యాత్మికత.. భారతీయ సంస్కృతిలో రెండూ విడదీయలేనివి!
- సైన్స్, స్పిరిచ్యువాలిటీ కలిసే ముందుకు సాగుతాయి..
- చంద్రయాన్-3తో అంతరిక్ష రంగంలో సత్తా చాటాం
- మైసూరులో దేశంలోనే తొలి ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియం ప్రారంభం..
- 100 కి.మీ. మెట్రో నెట్‌వర్క్ క్లబ్‌లో బెంగళూరు



'ఆపరేషన్ సిందూర్' ప్రైవేటు భద్రతా సిబ్బంది ప్రాధాన్యాన్ని చాటింది

- మాజీ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది
- దేశంలో కోటి మందికి పైగా ఈ రంగంలో పనిచేస్తున్నారన్న ద్వివేది
- వారి అనుభవానికి గుర్తింపు, నైపుణ్యాలకు ధ్రువీకరణ కల్పించాలని సూచన
- పోలీసు, అగ్నిమాపక విభాగాలతో సమన్వయం పెంచాలని వ్యాఖ్య
- వివిధ సంస్థలు సమన్వయంతో పనిచేయడం వల్లే రక్షణ సాధ్యమైందని వెల్లడి
- భౌతిక ప్రపంచంతో పాటు డిజిటల్ రంగం, ప్రజల ఆలోచనా విధానాల్లోనూ సంఘర్షణలు జరుగుతున్నాయని ద్వివేది

డేటా సెంటర్లకు భారీ పెట్టుబడులు

- విశాఖకు పెట్టుబడుల వరద.. రూ.1.05 లక్షల కోట్ల ఒప్పందాలు!
- లోకేశ్ సమక్షంలో 24 కంపెనీలతో ఎంఓయూలు
- 75,055 మందికి ఉద్యోగావకాశాలు
- డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, హెల్త్‌కేర్ రంగాలకు భారీ పెట్టుబడులు
- ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రణాళిక
- 31 స్టార్టప్‌లకు తొలి విడతగా రూ.2.11 కోట్ల ఆర్థిక సాయం

విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ 31వ భాగస్వామ్య సదస్సులో రెండో రోజు భారీ ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో 24 కంపెనీలతో ప్రభుత్వం రూ.1,05,634 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకుంది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో అదనంగా 75,055 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయని వెల్లడించారు. ఏరోస్పేస్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, వైద్య ఆరోగ్య రంగం, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడులకు పారిశ్రామిక సంస్థలు ఆసక్తి చూపాయి. రెండో రోజు ఒప్పందాల్లో డేటా సెంటర్ల రంగం - మిగతా 3లో



పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం ముందంజ

- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- విభజన గాయాలను అధిగమించి అభివృద్ధిలో ఏపీ దూకుడు!
- 2024 జూన్ నుంచి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం అసాధారణ విజయం
- యువతలో నైపుణ్యాలు పెంచాలి.. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- ఒప్పందాలు కార్యరూపం దాల్చినప్పుడే నిజమైన అభివృద్ధి

భారత్‌కు ఇంకా సంపూర్ణ ఆహార భద్రత లేదు!

- వంటనూనెల కోసం విదేశీ దిగుమతులపైనే ఆధారం.. ఏటా 17 మిలియన్ టన్నుల దిగుమతి
- అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గులతో దేశీయ మార్కెట్‌పై ప్రభావం..
- ఆహార ఉత్పత్తుల స్వయం సమృద్ధిపై నీతి ఆయోగ్ ఆందోళన



నీటి కోసం కేసి పై జాగారం

కదిలిన జీనపల్లె రైతాంగం

నీటి వాటాలో సమ న్యాయం పాటించని యంత్రాంగం



సంద్యాల.సిరివెళ్ల:నవంబర్=13 ప్రజాజ్యోతి ఆరుగాలం కష్టపడి ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసే అన్నదాతకు నేడు నిద్రాహారాలు కరువై నీటి కోసం జాగారం చేయాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. రెండు కార్లు మాగాని పంటలు సాగు చేసిన రైతులు నేడు ఆరుతడి సాగుకైనా నీరు అందించాలని కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు పగలు రాత్రి అనే తేడా లేకుండా కేసీ కెనాల్ కాలువపై నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. అరకొరగా వస్తున్న నీటిని ఒకే వైపు మళ్లించకుండా సమన్యాయం పాటించాల్సిన అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం అయ్యారని క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి గాలికి వదిలేసారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శిరివెళ్ల మండలం, జీనపల్లె గ్రామానికి చెందిన అన్నదాతలు తమ గ్రామ పరిధిలో నుండి 16వ లాకు, జిల్లెళ్ల మరియు ఎగువన ఉన్నటువంటి అడ్డంకులను అక్రమంగా పారుతున్న నీటిని చూసి తల్లడిల్లి పోతున్నారు. తమ గ్రామ పరిధిలో ఎండుతున్న పొలాలకు నీటిని వదలాలని ఎంత ప్రయత్నించినా వినే నాధుడే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీ కెనాల్ లో వస్తున్న నీటిని ఒక వైపే అధికంగా మళ్లిస్తూ అన్యాయం చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కేసీ కెనాల్ అధికారులు కాలువ వెంట నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తూ ఏ లాక్ నుండి ఏ మోతాదులో నీటిని విడుదల చేయాలని సూచించాల్సిన అధికారులు అడ్రస్ లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 100మందికి పైగా రైతన్నలు కేసీ కెనాల్ 16వ లాకుపై నిరీక్షిస్తున్నప్పటికీ నీరు దిగువకు రావడంలేదని జీనపల్లె రైతులు పేర్కొంటున్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆరుతడి పంటలు సాగు చేసినట్లు తెలిపారు. అధికారుల మాటలను లెక్కచేయకుండా మాగాని సాగుచేసిన రైతన్నలు నీటిని తీసుకు వెళుతుంటే అధికారులు రైతులు ఏమీ చేయలేని పరిస్థితి ఎదురవుతున్నదని పలు గ్రామాల రైతులు అంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అరుతడి సాగు చేసిన తమకు నీటిని విడుదల చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జీనపల్లె గ్రామ రైతులు పేర్కొంటున్నారు. కేసీ కెనాల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి మళ్లింపులో రైతులు ఘర్షణలకు తావు లేకుండా సమన్యాయం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని రైతులు సూచిస్తున్నారు..

జ్యోతిర్మయునిగా దర్శనమివ్వనున్న ఆలమూరు శ్రీ జనార్ధనస్వామి వారు.



ఆలమూరు నవంబర్ 13(ప్రజాజ్యోతి):కార్తిక మాసంలో వెలిగే ప్రతీ దీపం భక్తికి ప్రతీకగా, ప్రతీ వెలుగు దైవానుగ్రహానికి సంకేతంగా భక్తులు భావిస్తారు. నవ జనార్ధన ఆలయాల్లో నాలుగవ క్షేత్రమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారు కార్తిక మాస తొలి శనివారం సందర్భంగా దివ్య కార్తిక దీప కాంతుల నడుమ దేదీప్యమానంగా జ్యోతిర్మయుడై దర్శనమివ్వనున్నారు. ప్రతీ భక్తుని హృదయంలో జ్యోతి స్వరూపమై అలరారుతున్న జనార్ధన స్వామి వారిని కార్తిక మాసంలో దర్శించుకోవడం అత్యంత పుణ్య ఫలప్రదమని ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు తెలియజేశారు. కావున భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు తెలిపారు.

నూతన వదూవరులను ఆశీర్వదించిన బీసీ.ఇందిరారెడ్డి



బనగానపల్లె:నవంబర్=13 ప్రజాజ్యోతి బనగానపల్లె మండలం నందవరం గ్రామానికి చెందిన శ్రీమతి చిలకమ్మ గారి లక్ష్మీదేవి మరియు జంబులయ్య దంపతుల ఆహ్వానం మేరకు శ్రీ నందవరీక బ్రాహ్మణ కళ్యాణ మండపం నందు ఏర్పాటు చేసిన వారి కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి

పైఅధికారులు ఆదేశాలతో!.. ఏజెన్సీ గ్రామాల్లో ధోమతెరల పంపిణీ!..

రేఖపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీలుఫర్!..




వరరామచంద్రాపురం, నవంబర్ 13 (ప్రజాజ్యోతి ప్రతినిధి) పోలవరం జిల్లా కలెక్టర్, చింతూరు ఐ.టి.డి.ఏ, ప్రాజెక్టు అధికారి, డి.ఏండహెచ్. ఓ, జిల్లా మలేరియా అధికారి, చింతూరు డిప్యూటీ డి.ఏం, హెచ్.ఓ, సహకారంతో రేఖపల్లి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీలోఫర్, ఆధ్వర్యంలో మూడో విడత దోమతెరలు పంపిణీ కార్యక్రమం, ఏజెన్సీ గ్రామాల్లో చేపట్టటం జరిగింది. శుక్రవారం, తమ్మాయి పేట, కిష్టవరం, ప్రతిపాక,తుష్టి వారి గూడెం,గుండుగూడెం, గ్రామాలలో దోమతెరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రాజేష్, మాట్లాడుతూ దోమతెరలు ఎలావాడాలో ప్రజలకు అవగాహన కల్పించారు. దోమతెరను నీడలో ఆరబెట్టాలని, సాయంత్రంపూట మంచానికి నాలుగు కర్రల సహాయంతో కట్టాలని వివరించారు.దోమతెరను ఎవరికి అమ్మరాదని, అలాగే బహుమతిగా ఇవ్వకూడదని, దోమతెర, నెలరోజుల తర్వాత, చల్లటి నీటితోముంచి ఆరబెట్టాలని సూచించారు. ఈ దోమతెరకు క్రిమిసంహారిక ముందుపూసి ఉంటుందని, సబ్బుగాని, సర్ఫ్ గాని, డిటర్జెంట్ వంటివి వాడకూడదని చెప్పారు. అలాగే బండకేసి బాధరాదని సూచించారు.చేపల వేటకు వాడకూడదని, ప్రజలకు తెలియజేశారు. తెలియ జేయడం శుక్రవారం, "ఫ్రైడే" డ్రైడే" కావున పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీరు నిలవలేకుండా, చూడాలని, నీటి తొట్లను మూడురోజులకు ఒకసారి నీరుమార్చడం చేయాలన్నారు. నీటి నిల్వలు లేకుండా ఉంటే దోమలు దరిచేరే అవకాశాలున్నాయని, జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధోమతెరలు పంపిణీ కార్యక్రమంలో, పి.హెచ్.ఎన్, భద్రకాళి,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రత్తయ్య, ఏ.ఎన్.ఎం,లు మహేశ్వరి, శశికళ, ఆశలు రత్నం, సంధ్య, లక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్' గ్రూప్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



ఆలమూరు నవంబర్ 13(ప్రజాజ్యోతి):మండలంలోని సంధిపూడి గ్రామానికి చెందిన 'హెల్పింగ్ హ్యాండ్స్' గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం దిగ్విజయంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఈ నెలలో గ్రామానికి చెందిన నిరుపేదలు కనకాల అచ్చియమ్మ, పిల్లా ఆంజనేయులు కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేశారు.భీమవరం వాస్తవ్యులు రేలంగి రత్నావతి మనమరాలు బొప్పన వేదామృత శ్రీ, మనవడు బొప్పన చతుర్ జన్మదినోత్సవం సందర్భంగా దాతలుగా ముందుకొచ్చి ఈ నెల సరుకులను సమకూర్చారు. అలాగే గ్రామంలో మరో కుటుంబానికి చెందిన దాసరి సత్యవతికి ఎప్పటిలాగే హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సహకారంతో సమకూర్చిన నిత్యవసర వస్తువులను ఆమెకు అందజేశారు.గత ఏడాది కాలంగా క్రమం తప్పకుండా పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సభ్యులను, దాతలను సంధిపూడి గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల వేడి షురూ



దేవనకొండ, ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్ (రాఘవేంద్ర) దేవనకొండ మండలం పరిధిలో ఉన్న గ్రామాలకు మొదటి పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ నెం.1800/ 2/2026, తేదీ 13.11.2026 ప్రకారం, రాష్ట్రంలో జరగనున్న 2026 సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా దేవనకొండ మండలాన్ని మొదటి.విడత (ఫేజ్) ఎన్నికల పరిధిలో చేర్చడం జరిగింది. ఈ మేరకు దేవనకొండ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది.

ఎన్నికల ముఖ్యమైన తేదీలు:

1. నామినేషన్ల స్వీకరణ: 15.11.2026 నుండి 17.11.2026 వరకు.
2. నామినేషన్ల పరిశీలన: 18.11.2026.
3. నామినేషన్ల తిరస్కరణపై అప్పీలు: 19.11.2026.
4. అప్పీళ్ల పరిష్కారం: 20.11.2026.
5. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ: 21.11.2026 మధ్యాహ్నం 3.00 గంటల వరకు.
6. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన: 21.11.2026.
7. పోలింగ్ తేదీ: 26.11.2026 ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు.
8. ఓట్ల లెక్కింపు: 26.11.2026 మధ్యాహ్నం 2.00 గంటల నుండి.

ఈ సందర్భంగా దేవనకొండ మండలంలోని గ్రామ పంచాయతీలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఎన్నికల షెడ్యూల్‌ను గమనించి, నిర్దేశిత గడువులో నామినేషన్లు దాఖలు చేయాలని తెలియజేయడమైనది.ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధ నలు మరియు జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుంది.

దేవనకొండ మండలం, కర్నూలు జిల్లా.

ఆధారం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ నెం.1800/ 2/2026, తేదీ 13.11.2026, అనుబంధం మరియు అనుబంధం.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం::





ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు వాసవి కళ్యాణ మండపం (అమ్మవారి శాల) పామిడి నందు ఈనెల 15 వ తేదీ ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పామిడి లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ మరియు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు మరియు క్లబ్ అధ్యక్షుడు పట్రా శ్రీనివాసులు తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైతే అన్ని రకాల కంటి ఆపరేషన్లకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తారు. శంకర కంటి ఆసుపత్రి వారు ప్రత్యేక బస్సుల్లో బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తారని లయన్స్ క్లబ్ సభ్యులు తెలియజేశారు. కంటి వైద్య శిబిరానికి హాజరయ్యే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్స్ రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని రావాలని తెలియజేశారు. ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని పామిడి మండల ప్రజలు మరియు పామిడి చుట్టూ ప్రక్కల ఉన్నటువంటి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు కోరారు.

సాయంత్రం కోర్టుల ఏర్పాటుపై న్యాయవాదుల నిరసన.



ఆలమూరు నవంబర్ 13(ప్రజాజ్యోతి):కేంద్ర న్యాయశాఖ అమలు చేయనున్న సాయంత్రం కోర్టుల (ఈవెనింగ్ కోర్టులు) ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కే. షరీఫ్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సాధారణ కోర్టు విధుల్లో పాల్గొన్న తర్వాత, తిరిగి రాత్రి వేళల్లో కోర్టులకు హాజరుకావడం వల్ల న్యాయవాదులపై శారీరకంగా మరియు మానసికంగా తీవ్ర ఒత్తిడి పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సాయంత్రం వేళల్లో కోర్టులు జరిగితే దూర ప్రాంతాల నుంచి వచ్చే కక్షిదారులు, సాక్షులు, ముఖ్యంగా మహిళా న్యాయవాదులు రాత్రి సమయాల్లో తిరిగి ఇళ్లకు చేరుకోవడానికి రవాణా మరియు భద్రతాపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదనపు సమయం కోర్టులు నిర్వహించడానికి అవసరమైన సిబ్బంది, భద్రత మరియు ఇతర మౌలిక సదుపాయాలు లేకుండా సాయంత్రం కోర్టులు పెట్టడం సరికాదని పలువురు న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సలాది సత్యనారాయణమూర్తి, గానుగుల శేషారావు, చల్లా సతీష్, ఎస్వివిఎస్ఎన్ మూర్తి,నరసింహమూర్తి ఆలమూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనాది యుగాల నుంచి కొనసాగుతున్న నాగులచవితి



సత్సంతానప్రాప్తికి సర్ప పూజ చేయడం అనవాయితి

నంద్యాల:నవంబర్=13 ప్రజాజ్యోతి నాగారాధన అనాది యుగాల నుంచి కొనసాగుతోంది. కార్తికశుద్ధ చవితినాడు నాగులచవితి జరుపుకోవటం ఆచారం. మన శరీరమే నవరంధ్రాల పుట్ట. అందులో పామురూపంలో ఉండే కుండలినీశక్తిని ఆరాధించడమే నాగులచవితి. శరీరమనే పుట్టలో అడుగున మండలాకారంలో మూడున్నర చుట్టలు చుట్టుకుని పడుకున్న పాము కామోద్రేకాలతో విషం కక్కుతూ ఉంటుంది. పాలు అనే యోగసాధన ద్వారా ఆ విషాన్ని హరించవచ్చు అని లౌకిక అర్థంలో చెప్పడమే నాగులచవితి ప్రయోజనం. నాగుల చవితినాటి రాత్రి నుంచి స్వచ్ఛమైన నీలాకాశంలో అనంతశయనాకృతి పాలపుంతగా స్పష్టంగా కానవస్తుంది. ఇది ఉత్థానఏకాదశి వరకూ ఎనిమిదిరోజుల పాటు ఆకాశంలో కనిపించే అద్భుత దృశ్యం. ఆ సమయంలో నాగారాధన వల్ల కామాన్ని, మృత్యువును జయించే సిద్ధి కలుగుతుంది. అందుకే కార్తికమాసమంతా నాగారాధన ప్రత్యేకంగా చేస్తారు. నాగులచవితికి పత్తితో చేసిన వస్త్రాలు, యజ్ఞోపవీతాల వంటి నూలు దారాలతో పుట్టలను అలంకరిస్తారు. చిన్నచిన్న "వెండిరేకుల్ని పుట్టకి పెట్టి 'పుట్టాకళ్లు'అలంకరిస్తారు. నాగులచవితికి నాగన్నా నీ పుట్టనిండా పాలుపోసేము తండ్రీ! నీ పుట్టదరికి మా పాపలొచ్చేరు. పొరపాటున 'తోక తొక్కితే తొలగిపో, నడుం తొక్కితే నడిచిపో! పడగ తొక్కితే పారిపో!' మమ్మల్ని, మా సంతానాన్ని కాపాడు అంటూ పుట్టలో పాలుపోస్తారు. ప్రదక్షిణ నమస్కారాలు చేస్తారు. చలిమిడి, చిమ్మిలి, అరటి పళ్లు, తాటి బుర్రగుంజు, తేగలు వంటివి నివేదన చేస్తారు. సర్పారాధనకు తామరపూలు, కర్పూరపూలు శ్రేష్ఠం. సర్పారాధనచేసే వారి వంశం తామరతంపరగా వర్ధిల్లుతుందని భవిష్య పురాణం చెబుతోంది. నాగేంద్రుడిని స్త్రీలు ఆరాధిస్తే శుభలక్షణాలు కలిగిన సంతానం కలుగుతుంది. కన్యలు ఆరాధిస్తే యోగ్యుడైన భర్త లభిస్తాడని విశ్వాసం. సౌభాగ్యానికి,

భవిష్యత్ సాంకేతికతపై ప్రత్యేక దృష్టి

-మొదటిపేజీ తరువాయి

సదస్సుతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులను కలిపి మొత్తం 303 ఒప్పందాలు కుదిరాయని చంద్రబాబు వివరించారు. వీటి ద్వారా రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు, 3.48 లక్షల ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనల్లో 526 ప్రాజెక్టులకు భూమి, ప్రోత్సాహకాల ఆమోదం ఇచ్చినట్లు చెప్పారు. వీటి ద్వారా రూ.17.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 12.9 లక్షల ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయని వెల్లడించారు. మరో 303 ప్రాజెక్టులు నిర్మాణ దశకు చేరుకున్నాయని, వీటి ద్వారా రూ.7.30 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.7 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఐదు దేశాలు, దేశంలోని ఆరు నగరాల్లో మొత్తం 11 రోడ్‌షోలు నిర్వహించినట్లు తెలిపారు.

రాష్ట్రంలోని ప్రాంతీయ ప్రత్యేకతలు, అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ), డేటా సెంటర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, రక్షణ రంగం, ఎలక్ట్రానిక్స్, సముద్రాధారిత పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కియా సంస్థ పెనుకొండ ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో రెండు లక్షల వాహనాలకు పెంచేందుకు రూ.18,878 కోట్ల పెట్టుబడి పెట్టనుందని, దీని ద్వారా 12 వేల ఉద్యోగాలు లభించనున్నాయని వెల్లడించారు.

ఎంఓయూల అమలుపై పారదర్శకత

పెట్టుబడుల ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ఎంఓయూ ఎంతవరకు కార్యరూపం దాల్చిందనే వివరాలను ఏటా ఆడిట్ నివేదిక ద్వారా వెల్లడిస్తామని ప్రకటించారు. గతంలో పెట్టుబడుల ఒప్పందాలు అమలులోకి రావడంలో సమస్యలు ఉండేవని, ఇప్పుడు ప్రతి ప్రాజెక్టును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు.



స్వీయ ధ్రువీకరణతోనే పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించేలా సంస్కరణలు తీసుకొచ్చామని వివరించారు. పెట్టుబడిదారులకు రక్షణ కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొస్తున్నామని, దీనిని కేంద్రం ఆమోదానికి పంపనున్నట్లు తెలిపారు. ఎస్క్రో ఖాతా విధానాన్ని కూడా అమల్లోకి తెచ్చినట్లు వెల్లడించారు.

వ్యవసాయం, ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం

వ్యవసాయ రంగం రాష్ట్రానికి ప్రధాన ప్రాధాన్యత అని చంద్రబాబు పేర్కొన్నారు. అగ్రి ప్రాసెసింగ్ రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించడంతో పాటు రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. రైతులకు మేలు చేసేందుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మొండలేజ్ సంస్థతో కలిసి కోకో మిషన్ ఏర్పాటు చేస్తున్నామని, అరకు కాఫీ ఉత్పత్తిని పెంచడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో దాని బ్రాండ్‌ను ప్రోత్సహించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. ఎంఎస్ఎంఈలను భారీ పరిశ్రమలతో అనుసంధానించి చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం అందించడంతో పాటు కామన్ ఫెసిలిటీ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

ప్రతి ప్రాంతానికీ సాగునీరు

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రోడ్డు, రైలు, విమాన, జల మార్గాల అనుసంధానాన్ని పెంచి లాజిస్టిక్స్ రంగాన్ని బలోపేతం చేస్తామన్నారు. పోలవరం నిర్మాణం, నదుల అనుసంధానం, రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తి ప్రభుత్వ ప్రాధాన్యతలని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రతి ప్రాంతానికి సాగునీరు అందేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. యువతలోని నైపుణ్యాలను గుర్తించేందుకు స్కిల్ సెన్సస్ నిర్వహించి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయాల నుంచి ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల వరకు నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను అనుసంధానిస్తామని వివరించారు. ద్వాక్రా ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండ్ తీసుకొచ్చామని, భూములు పొందినప్పటికీ పరిశ్రమలు స్థాపించని సంస్థలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకి అమరావతి

అమరావతిని క్వాంటమ్ కంప్యూటర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. ఇక్కడ తయారైన క్వాంటమ్ కంప్యూటర్లను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేసే స్థాయికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. అంతరిక్షం నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఉపగ్రహాల్లో డేటా సెంటర్ల ఏర్పాటుపైనా అధ్యయనాలు జరుగుతున్నాయని వెల్లడించారు. కొత్త సాంకేతికతను అర్థం చేసుకుని భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతాం

విశాఖపట్నంలో ఐటీ, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వివిధ దేశాలకు అనుసంధానించే సబ్‌సీ కేబుళ్ల ఏర్పాటుతో డిజిటల్ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. నగరంలో మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులను అరకు లోయకు తీసుకెళ్లి రాష్ట్ర పర్యాటక విశేషాలను పరిచయం చేస్తామని వెల్లడించారు.

డేటా సెంటర్లకు భారీ పెట్టుబడులు

-మొదటిపేజీ తరువాయి

ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పంచశీల్ రియాల్టీ సంస్థ రాష్ట్రంలో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.37 వేల కోట్ల పెట్టుబడితో ముందుకొచ్చింది. ఏఎం–ఏఐ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.31,387 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి ఒప్పందం చేసుకుంది. వారీ ఎనర్జీస్ రూ.10 వేల కోట్లు, క్లీన్‌మాక్స్ ఎన్విరో ఎనర్జీ రూ.8 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి.

ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని మంత్రి లోకేశ్ తెలిపారు. భారీ పరిశ్రమలతో పాటు చిన్న పరిశ్రమలను ప్రోత్సహించి బలమైన పారిశ్రామిక వ్యవస్థను అభివృద్ధి చేస్తామని చెప్పారు. సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ ప్రదర్శనను సందర్శించిన ఆయన వివిధ సంస్థల ఉత్పత్తులను పరిశీలించారు. ఏఐ డ్రోన్లు, విద్యా రంగంలో ఉపయోగించే రోబోలు, క్వాంటమ్ పరికరాలు, లిథియం బ్యాటరీల తయారీ, వినియోగం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. యువ పారిశ్రామికవేత్తలతో మాట్లాడి వారి వ్యాపార ప్రణాళికలు, ఉద్యోగాల కల్పనపై ఆరా తీశారు.

స్టార్టప్‌లకు ఆర్థిక చేయూత

యువతలోని ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఏపీ స్టార్టప్ ఎక్స్‌ఛేంజ్ కార్యక్రమం ద్వారా 31 స్టార్టప్‌లకు తొలి విడతగా రూ.2.11 కోట్ల ఆర్థిక సాయం అందించారు. ప్రతిభ కనబరిచిన ఆరు స్టార్టప్‌ల నిర్వాహకులను మంత్రి లోకేశ్ సత్కరించారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే యువతకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

డిక్సన్ టెక్నాలజీస్ కొత్త యూనిట్

తిరుపతిలోని ఈఎంసీ–2లో రూ.700 కోట్ల పెట్టుబడితో కొత్త యూనిట్ ఏర్పాటు చేసేందుకు డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సంస్థ అధ్యక్షుడు పంకజ్ శర్మతో మంత్రి లోకేశ్ సమావేశమై చర్చించారు. ఈ యూనిట్ ద్వారా సుమారు 2,300 మందికి ఉపాధి లభించనుంది. అలాగే ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఎండీ శాశ్వత్ గోయెంకాతోనూ లోకేశ్ సమావేశమయ్యారు. క్రీడలు, ఫ్యాషన్, గ్రీన్ ఎనర్జీ, ఐటీ రంగాల్లో ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

రక్షణ రంగంలోనూ ఏపీకి అవకాశాలు

సముద్ర భద్రత, రక్షణ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను కీలక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశాలపై సాగర్ డిఫెన్స్ సంస్థ ప్రతినిధులతో మంత్రి చర్చించారు. జువ్వలదిన్నెను మానవరహిత నౌకల తయారీ, ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దే ప్రతిపాదనను వివరించారు. రాష్ట్రంలో రక్షణ, విమానయాన రంగాలకు అనుకూలమైన వాతావరణం కల్పించి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

స్థానిక కళలకు ప్రాధాన్యం

స్థానిక చేనేత కళాకారులను ప్రోత్సహించడంలో భాగంగా మంత్రి లోకేశ్ మరోసారి ఆకర్షణీయమైన హ్యాండ్లూమ్ జాకెట్ ధరించారు. తాను ధరించిన జాకెట్ ఏ ప్రాంతానికి చెందినదో గుర్తించాలంటూ సామాజిక మాధ్యమాల ద్వారా నెటిజన్లను కోరారు. స్థానిక చేనేత, హస్తకళలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న సందేశాన్ని తన వస్త్రధారణ ద్వారా చాటారు.

పోర్టుల అనుసంధానంతో ఏపీ అభివృద్ధికి కొత్త ఊతం!

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. సుదీర్ఘ సముద్రతీరం, అనేక పోర్టులు ఉండటం ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలమైన అంశమని గడ్కరీ పేర్కొన్నారు. విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం వంటి పోర్టులను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోర్టుల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు సరుకుల రవాణా సులభతరం కావాలంటే రహదారుల అనుసంధానం మెరుగుపడాలని అభిప్రాయపడ్డారు. ఎగుమతులు, దిగుమతుల రంగం విస్తరించాలంటే లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించడం ముఖ్యమని తెలిపారు.

రాయ్‌పూర్--విశాఖ కారిడార్ కీలకం

రాయ్‌పూర్--విశాఖ కారిడార్ నిర్మాణం సుమారు 96 శాతం పూర్తయిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. సరుకు రవాణా వేగవంతం కావడంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు ఈ కారిడార్ దోహదపడుతుందని వివరించారు. దేశంలోని ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఇదొకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

బెంగళూరు--విజయవాడ కారిడార్‌తో దూరం తగ్గింపు

బెంగళూరు--విజయవాడ కారిడార్ వల్ల ప్రయాణ దూరం



సుమారు 110 కిలోమీటర్లు తగ్గిందని గడ్కరీ తెలిపారు. బెంగళూరు--చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే వచ్చే జనవరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య రవాణా మరింత సులభమవుతుందని వివరించారు. ఖరగ్‌పూర్--అమరావతి కారిడార్ కూడా అందుబాటులోకి వస్తే రాష్ట్రానికి అదనపు ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు.

అమరావతి చుట్టూ 192 కి.మీ. రింగ్‌రోడ్డు

అమరావతి చుట్టూ 192 కిలోమీటర్ల పొడవైన ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణ ప్రతిపాదన ఉందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కేంద్ర కేబినెట్ ఆమోదం పొందే దిశగా ఉందని తెలిపారు. విశాఖ--మచిలీపట్నం కారిడార్ కూడా ఏపీ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాలను అనుసంధానించేందుకు పలు రహదారి కారిడార్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు.

పరిశ్రమలు, వాణిజ్యానికి రవాణా బలం

హైవేలు, గ్రీన్‌ఫీల్డ్ కారిడార్లు, పోర్టుల అనుసంధానం సమగ్రంగా అభివృద్ధి చెందితే రాష్ట్రంలో పరిశ్రమలు, వాణిజ్య కార్యకలాపాలకు మరింత అవకాశం ఏర్పడుతుందని గడ్కరీ అభిప్రాయపడ్డారు. రవాణా సమయం, ఖర్చు తగ్గడం ద్వారా పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. మౌలిక సదుపాయాల విస్తరణతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక కార్యకలాపాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని వివరించారు.

పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం ముందంజ



విశాఖపట్నం: విభజనతో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసించారు. విశాఖపట్నంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీఐఐ అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రం రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం అసాధారణ విజయమని పేర్కొన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, ఎలక్ట్రానిక్స్, అంతరిక్షం, రక్షణ, పర్యాటక రంగాల్లో ఏపీ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎదుగుతోందని తెలిపారు.

పెట్టుబడిదారుల విశ్వాసం పెరిగింది

రాష్ట్రానికి చంద్రబాబు వంటి విజనరీ నాయకత్వం ఉండటం అభివృద్ధికి దోహదపడుతోందని ఉపరాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. సుదీర్ఘ సముద్రతీరం, పోర్టులు, మౌలిక సదుపాయాలు ఏపీకి ప్రత్యేక బలమని చెప్పారు. పెట్టుబడిదారులను ఆకర్షించడంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందన్నారు. కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోందని ప్రశంసించారు. వచ్చే ఏడాది సదస్సుకు కూడా పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడే ఆహ్వానించడం ఆయన ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

యువతలో నైపుణ్యాలు పెంచాలి

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్రం ముందుకు సాగాలని రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. భవిష్యత్తులో కృత్రిమ మేధ (ఏఐ) వంటి అధునాతన సాంకేతికత అభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా నిలుస్తుందని చెప్పారు. పాలన, పౌర సేవల్లోనూ సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాలని సూచించారు. అంతర్జాతీయ పోటీని తట్టుకునేలా తయారీ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ కల్పించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.

ఒప్పందాలు కార్యరూపం దాల్చాలి

ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యారంగం, ఆవిష్కర్తలు సమన్వయంతో పనిచేసినప్పుడే దేశ ఆర్థిక శక్తి మరింత బలోపేతమవుతుందని ఉపరాష్ట్రపతి అన్నారు. పెట్టుబడుల ఒప్పందాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. 'కలిసి పనిచేద్దాం.. కలిసి ఎదుగుదాం.. సంపదను పంచుకుందాం' అంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా భారత్ సుస్థిర అభివృద్ధి సాధిస్తోందని, ప్రపంచ దేశాల పెట్టుబడిదారులు భారత్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు.

తొమ్మిదోసారి సదస్సు విజయవంతం

విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సును తొమ్మిదోసారి విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావడం శుభపరిణామమని, వీటి ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సుతో ఆంధ్రప్రదేశ్‌పై దేశవిదేశీ పారిశ్రామికవేత్తలకు ఉన్న విశ్వాసం మరోసారి వెల్లడైందన్నారు. రెండు రోజుల సదస్సులో ఆసియా నుంచి ఆఫ్రికా వరకు వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారని గవర్నర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్ ప్లాంట్, తూర్పు కోస్తా రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులు కేంద్ర సహకారంతో ముందుకు సాగుతున్నాయని వివరించారు. సదస్సులో పాల్గొన్న దేశవిదేశీ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలకు అభినందనలు తెలిపారు.

తారు కొరతకు బ్రేక్.. విదేశీ దిగుమతులకు ఏపీ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్!

అమరావతి: పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రంలో రహదారి నిర్మాణ, మరమ్మతు పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ముడి చమురు ధరలు పెరగడం, బిట్‌మెన్ (తారు) సరఫరా తగ్గడంతో నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగింది. ఫలితంగా పలు ప్రాంతాల్లో రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విదేశాల నుంచి తారు దిగుమతి చేసుకోవడంతో పాటు, ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కూడా కొనుగోలు చేసేందుకు రహదారులు, భవనాల శాఖకు అనుమతి ఇచ్చింది. ఈ వెసులుబాటు వచ్చే ఏడాది మార్చి 31 వరకు లేదా చమురు రంగంలో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు కొనసాగనుంది.

యుద్ధ ప్రభావంతో తారు కొరత

అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. ముడి చమురు సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో ధరలు పెరిగాయి. చమురు శుద్ధి ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా లభించే బిట్‌మెన్ సరఫరా కూడా తగ్గింది. హార్ముజ్ జలసంధి మీదుగా చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడటం ఈ పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. రహదారుల నిర్మాణం, మరమ్మతులకు ఉపయోగించే వీజీ–10, వీజీ–30, వీజీ–40 రకాల తారుకు కొరత ఏర్పడింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ వంటి సంస్థలు కూడా అవసరమైన స్థాయిలో సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది.

గుత్తేదారులపై పెరిగిన భారం

తారు ధరలు పెరగడం, సరఫరా తగ్గడంతో రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



గతంలో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం పనులు కొనసాగిస్తే నష్టాలు వస్తాయని భావించి పలువురు గుత్తేదారులు పనులను నిలిపివేశారు. దీంతో రోడ్ల మరమ్మతులు, విస్తరణ పనులు నెమ్మదించాయి. గత ఏడాది రూ.871 కోట్ల విలువైన మరమ్మతు పనులు చేపట్టగా, ఈ ఏడాది 10 వేల కిలోమీటర్ల మేర రూ.3 వేల కోట్లతో చేపట్టాల్సిన పనుల్లో సుమారు 50 శాతమే పూర్తయినట్లు కథనంలో పేర్కొన్నారు.

ప్రైవేటు కొనుగోళ్లకు అనుమతి

యుద్ధ పరిస్థితులు త్వరలోనే సద్దుమణుగుతాయని తొలుత ప్రభుత్వ సంస్థలు ఆశించాయి. అయితే అంతర్జాతీయ పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాయి. ప్రైవేటు సంస్థలు, విదేశీ సరఫరాదారుల నుంచి తారు కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని ఆర్ అండ్ బీ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్, చీఫ్ ఇంజినీర్ల కమిటీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. పెరిగిన తారు ధరలకు అనుగుణంగా పాత ఒప్పందాల్లోనూ ధరల సర్దుబాటు కల్పించాలని కోరింది. ఈ అంశాన్ని ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రభుత్వం ప్రైవేటు కొనుగోళ్లు, దిగుమతులకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది.

మార్చి 31 వరకు వెసులుబాటు

ప్రభుత్వం జారీ చేసిన మెమో ప్రకారం ప్రైవేటు సంస్థల నుంచి తారు సేకరణకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు లేదా చమురు రంగంలో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అనుమతి ఉంటుంది. ధరల సర్దుబాటు 2021లో జారీ చేసిన జీవో 62 ప్రకారమే ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు కథనంలో పేర్కొన్నారు. చమురు సంస్థలు ప్రకటించే ధరలకు అనుగుణంగా కొనుగోళ్లు జరపాలని సూచించింది.

రోడ్డు పనులకు ఊరట

ప్రభుత్వ తాజా నిర్ణయంతో తారు కొరత కారణంగా నిలిచిపోయిన రహదారి మరమ్మతులు, నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ప్రైవేటు కొనుగోళ్లు, విదేశీ దిగుమతుల ద్వారా సరఫరా మెరుగుపడితే కాంట్రాక్టర్లకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గడంతో పాటు, పెండింగ్ పనుల పురోగతికి మార్గం సుగమం కానుంది. అయితే దిగుమతుల ద్వారా ఎంతమేర తారు అందుబాటులోకి వస్తుంది, ధరల నియంత్రణ ఎలా ఉంటుంది, పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయన్నది కీలకంగా మారింది.

విలీన మండలాలకు శాశ్వత మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలి

చింతూరు లేదా ఎటపాకలో కోర్టు ఏర్పాటు చేయాలని

హైకోర్టు న్యాయమూర్తులకు న్యాయవాదుల వినతి







ఎటపాక, నవంబర్ 13 (ప్రజా జ్యోతి): పోలవరం జిల్లాలోని నాలుగు విలీన మండలాల ప్రజలకు స్థానికంగానే సత్వర న్యాయం అందించేందుకు చింతూరు లేదా ఎటపాకలో పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును శాశ్వతంగా ఏర్పాటు చేయాలని విలీన మండలాల న్యాయవాదుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. హరినాథ్, జస్టిస్ బట్టు దేవానంద్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌లకు అధికారికంగా వినతిపత్రాలు సమర్పించారు. చింతూరు, ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైనప్పటి నుంచి స్థానికంగా పూర్తిస్థాయి కోర్టు లేకపోవడంతో గిరిజన కక్షిదారులు, సాక్షులు, న్యాయవాదులు కోర్టు విచారణల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల ప్రయాణ ఖర్చులతో పాటు రోజువారీ కూలీ పనులు కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, విలీన మండలాల న్యాయవాదుల సంఘం సభ్యులు పేరాల నాగరాజు, పామరాజు తిరుమలరావు, వలవల సురేష్ కుమార్, కొత్తపల్లి రాంబాబు, విజ్జగిరి రవితేజ, సున్నం వెంకటరమణ, మోసం సంజీవరావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో హోటళ్లు, లాడ్జీల్లో పోలీసుల విస్తృత తనిఖీలు



బాపట్ల నవంబర్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) రాబోయే పంచాయతీ, బాపట్ల మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి జిల్లా వ్యాప్తంగా హోటళ్లు, లాడ్జీలు, రిసార్ట్స్, ఇతర అతిథి గృహాల్లో పోలీస్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో బస చేస్తున్న వ్యక్తుల వివరాలు, వారి స్వస్థలం, రాకకు గల కారణాలు, బసకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వ్యక్తులు, పాత నేరస్థులు ఎవరైనా ఆశ్రయం పొందుతున్నారా, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయా, అనే అంశాలపై విచారణ చేపట్టారు. బస చేసేందుకు వచ్చే వారి వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదు చేయాలని హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. జిల్లాలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గుర్తించినట్లయితే స్థానిక పోలీసులకు, కమాండ్ కంట్రోల్ నంబర్ 8333813228 లేదా అత్యవసర టోల్ ఫ్రీ నంబర్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

సిరివెళ్ల నీటిగుంటలో తగ్గుతున్న నీటి మట్టం.. ప్రజల్లో తాగునీటి ఆందోళన!

అత్యవసరంగా స్పందించి ఆనకట్ట కుంటకు నీరు

విడుదల చేయాలని ప్రజల డిమాండ్



నంద్యాల:సిరివెళ్ల:నవంబర్=13ప్రజాజ్యోతీ సిరివెళ్ల గ్రామంలో నీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. గ్రామానికి ప్రధాన ఆధారంగా ఉన్న నీటిగుంటలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో తాగునీటి ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నీటిగుంటలో నీటి మట్టం తగ్గుతున్నప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత అధికారులు నీటిని తీసుకొచ్చి కుంటను నింపేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి అత్యవసరంగా స్పందించి ఆనకట్ట కుంటకు నీటిని విడుదల చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కుంటలో నీరు చేరితే భూగర్భ జలాలు పెరిగి, గ్రామంలోని బోర్లలో నీటి లభ్యత యథావిధిగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్య మరింత తీవ్రరూపం దాల్చకముందే అధికారులు తక్షణ చర్యలు చేపట్టి సిరివెళ్ల ప్రజలకు నీటి కష్టాలు రాకుండా చూడాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

బాలలే రేపటి చరిత్ర నిర్మాతలు.. వారి భవిష్యత్తుకు నేటి ప్రోత్సాహమే పునాది

-- గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్. యశోద గౌడ్



గుంతకల్లు నవంబర్ 13 (ప్రజా జ్యోతి): నేటి బాలలే రేపటి చరిత్ర నిర్మాతలని, వారి భవిష్యత్తుకు నేటి ప్రోత్సాహమే పునాది అని గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్. యశోద గౌడ్ పేర్కొన్నారు. విద్యార్థు ల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, సరైన అవకాశాలు కల్పించి ప్రోత్సహించిన ప్పుడే వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరో హిస్తారని అన్నారు. శుక్రవారం జన విజ్ఞాన వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంతకల్‌లోని డాక్టర్ సరోజినీ నాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా యశోద గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజాన్ని అర్థం చేసుకునే జ్ఞానాన్ని, ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్నిఅలవర్చు కోవాలని సూచించారు. చదువుతో పాటు క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసం, సంస్కారం, మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ముఖ్యంగా బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ విద్య, విజ్ఞానం, క్రీడలు, ఇతర అన్ని రంగాల్లో తమదైన ముద్ర వేయాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికితీసేందుకుతల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విద్యార్థుల సృజనాత్మకతకు వేదిక కల్పించిన జన విజ్ఞాన వేదికను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం భారత తొలి ప్రధానమంత్రి, బాలల ప్రియతమ నాయకుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. జన విజ్ఞాన వేదిక నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమ తులు అందజేసి అభినందిం చారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ యశోద గౌడ్‌ని జనవిజ్ఞాన వేదిక నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. హరి ప్రసాద్ యాదవ్, అధ్యక్షులు గంగరాజు, మహిళా అధ్యక్షురాలు ధరణి యాదవ్, పట్టణ నాయకులు చిట్టిబాబు, ప్రముఖ యాంకర్ మహేష్ రాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సరిత, ఉపాధ్యాయులు నిర్మల, ప్రశాంతి, మంజుల, స్వర్ణలత, దీప్తి, ఉమాదేవి, కుముద, నలంద, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. బాలల ప్రతిభకు గుర్తింపు.. వారి కలలకు ప్రోత్సాహం.. విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి కృషి! అనే ఆశయంతో జన విజ్ఞాన వేదిక నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి.

భక్తిపారవశ్యంలో నాగుల చవితి వేడుకలు

నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు

పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్న మహిళలు, భక్తులు



ఎటపాక, నవంబర్ 13 (ప్రజాజ్యోతి): ఎటపాక మండలంలోని బుట్టాయగూడెం, గన్నవరం తదితర గ్రామాల్లో నాగుల చవితి పర్వదిన వేడుకలు భక్తిశద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో నాగేంద్ర స్వామి పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగదేవతకు పాలు సమర్పించి, పసుపు, కుంకుమ, పూలతో పుట్టలను అలంకరించి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా దీపారాధనలు నిర్వహించి, తమ మొక్కులను చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని నాగేంద్ర స్వామిని వేడుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని నాగదేవతను ప్రార్థించారు. నాగుల చవితి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో ఎక్కడ చూసినా భక్తి వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పూజా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పుట్టల వద్ద సందడి కనిపించింది. భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాలు, నాగేంద్ర స్వామి పుట్టలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. దీంతో బుట్టాయగూడెం, గన్నవరం గ్రామాల్లో పండుగ శోభ సంతరించుకుంది.

మీ ఓటు.. మీ గ్రామ భవిష్యత్తు! ఒక్కసారి ఆలోచించండి.. ఆ తర్వాతే నిర్ణయం తీసుకోండి!



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ ప్రజలు సర్పంచ్‌గా ఎవరిని ఎన్నుకోవాలనే విషయంపై ఒక్కసారి ఆలోచించాలి. ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్న వ్యక్తికి అవకాశం ఇవ్వాలా? లేక కొత్త ఆలోచనలు, యువ ఉత్సాహంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఉన్న యువతకు బాధ్యతలు అప్పగించాలా? అనేది ప్రజలే నిర్ణయించుకోవాలి.గత ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు నెరవేరాయా? గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు ఎంతవరకు మెరుగుపడ్డాయి? ప్రజల సమస్యలకు పరిష్కారం లభించిందా? అనే విషయాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. ఎన్నికల సమయంలో డబ్బులు పంచి ఓట్లు అడిగే నాయకులు గెలిచిన తర్వాత కూడా ప్రజలకు అందుబాటులో ఉంటారా? ఈరోజు ఇచ్చే కొద్దిపాటి డబ్బు రేపు ఐదేళ్ల గ్రామ భవిష్యత్తుకు ఉపయోగపడుతుందా? ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగే నాయకులు గెలిచిన తర్వాత కూడా ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటారా? అనేది ఆలోచించాల్సిన విషయం.సర్పంచ్ పదవి అనేది కేవలం హోదా కాదు.. గ్రామ ప్రజల పట్ల ఉన్న బాధ్యత. గ్రామ అభివృద్ధి కోసం కృషి చేసే నాయకత్వం, ప్రజల సమస్యలపై స్పందించే మనస్తత్వం, పారదర్శకత, సేవాభావం ఉన్న అభ్యర్థిని గుర్తించాలి.ఒక్కసారి ఆలోచించండి.. మీ ఓటు కేవలం ఒక వ్యక్తిని గెలిపించడానికి మాత్రమే కాదు.. రాబోయే ఐదేళ్ల పాటు మీ గ్రామ భవిష్యత్తును నిర్ణయించడానికి. కులం, మతం, బంధుత్వం, డబ్బు వంటి ప్రలోభాలకు అతీతంగా ఆలోచించి ఓటు వేయండి. గుర్తుంచుకోండి.. ఓటు ఐదేళ్ల భవిష్యత్తుకు పునాది. మీ ఓటు విలువను గుర్తించండి.. మీ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కండి!

చింతకొమ్మదిన్నెలో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

చింతకొమ్మ దిన్నె ప్రజాజ్యోతి 13/11/26 చింతకొమ్మదిన్నె: మండలంలోని శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయ అధికారి పి. ఇబ్రహీం తెలిపారు.ఈ సందర్భంగా వారోత్సవాల కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.

- నవంబర్ 14: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం.
- నవంబర్ 15: గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహణ.
- నవంబర్ 16: వివిధ కార్యక్రమాల నిర్వహణ.
- నవంబర్ 17: 6, 7వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు.
- నవంబర్ 18: 8, 9వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు.
- నవంబర్ 19: మహిళా దినోత్సవ కార్యక్రమం.
- నవంబర్ 20: వారోత్సవాల ముగింపు కార్యక్రమం, పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం.

ఈ వారోత్సవాల్లో మండలంలోని విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి పి. ఇబ్రహీం కోరారు.

పి. ఇబ్రహీం
శాఖా గ్రంథాలయ అధికారి,
చింతకొమ్మదిన్నె, వైఎస్ఆర్ జిల్లా.

శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంకు ఎలక్ట్రికల్ ఆటోను విరాళం ఎక్కిన గౌను కృష్ణయ్య సతీమణి



గుంతకల్లు నవంబర్ 13 (ప్రజా జ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానం కు హైదరాబాద్ నగరం మెహిదీపట్నం వాస్తవ్యులు గౌను కృష్ణయ్య సతీమణి సంగీత మహేంద్ర కంపెనీ ఎలక్ట్రికల్ ఆటోను ఈఓ మేడే పల్లి విజయరాజు సమక్షంలో దేవస్థానమునకు విరాళంగా అందజేశారు.

తుపాను నష్టాలపై కేంద్ర బృందానికి వివరించిన కలెక్టర్

బాపట్ల నవంబర్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మురసు తుపాను కారణంగా బాపట్ల జిల్లాలో జరిగిన నష్టాల వివరాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కేంద్ర బృందానికి వివరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నష్టాలను అంచనా వేసేందుకు శుక్రవారం జిల్లాకు చేరుకున్న అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైంది. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ రంగాలకు జరిగిన నష్టాలను ఫొటో ప్రదర్శన, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించి నివేదికను అందజేశారు.జిల్లాలోని 15 మండలాలు తుపాను ప్రభావానికి గురికాగా, తొమ్మిది మండలాల్లో తీవ్ర నష్టం సంభవించిందని కలెక్టర్ తెలిపారు. 21 గ్రామాలు నీట మునిగాయని, ముగ్గురు వ్యక్తులు, 28 పశువులు మృతి చెందాయని పేర్కొన్నారు. 1,470 ఇళ్లు నీట మునగగా, 153 పునరావాస కేంద్రాల ద్వారా 11,507 మందికి ఆశ్రయం, భోజన సదుపాయాలు కల్పించినట్లు వివరించారు.తుపాను కారణంగా జిల్లాలో మొత్తం రూ.320.49 కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. 4,129 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 140 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రహదారులు వంతెనలు, కాల్వలు, విద్యుత్ వ్యవస్థలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. 94 ఆర్‌అండ్‌బీ రహదారులు, 20 వంతెనలు దెబ్బతినడంతో పాటు విద్యుత్ శాఖకు రూ.22.39 కోట్ల నష్టం సంభవించినట్లు వివరించారు. జీవనోపాధి కోల్పోయిన వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు.కేంద్ర బృందం నాయకుడు, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ తుపాను వ్యవసాయ, ఆక్వా, విద్యుత్, రహదారుల రంగాలపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. విపత్తు సమయంలో ఆర్‌టీజీఎస్ ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తూ జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన నష్టాల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు ప్రశాంత్ ఆర్మోరికర్, హిమాలయ గార్గ్, ప్రణయ్ గర్గ్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చింతూరు"లేదా"ఎటపాక డివిజనల్ కేంద్రంలో!..
రెగ్యులర్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును శాస్వితంగాఏర్పాటు చేయాలి!..





న్యాయవాదులు!..

వరరామచంద్రాపురం, నవంబర్ 13 (ప్రజాజ్యోతి ప్రతినిధి) పోలవరం జిల్లాలోని చింతూరు, ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం విలీన మండలాల్లో చింతూరు రెవెన్యూ డివిజనల్ కేంద్రంలోగానీ,ఎటపాక మండల కేంద్రంలోగానీ పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును శాశ్వతంగా ఏర్పాటు చేయాలని కోరుతూ "విలీన మండలాల న్యాయవాదుల సంఘం" ప్రతినిధులు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. హరినాథ్ కి,జస్టిస్ బట్టు దేవానంద్,కి అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,కి అధికారికంగా వినతిపత్రాలు సమర్పించారు. నాలుగు ఏజెన్సీ మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ప్పటి నుండి స్థానికంగా కోర్టులేకపోవడంతో కేసుల విచారణలో, తీవ్రజాప్యం జరుగుతోందని, అన్ని మండ లాలకు రవాణా సౌకర్యం, ఉన్న ఎటపాక లేదా చింతూరులో, రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును వెంటనే మంజూరుచేసి గిరిజనుల, గడపవద్దకే, సత్వరన్యాయం అందించాలని న్యాయవాదుల బృందం విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, విలీనమండలాల న్యాయవాదుల సంఘం సభ్యులు పేరాల నాగరాజు, పామరాజు తిరుమలరావు, వలవల సురేష్ కుమార్, కొత్తపల్లి రాంబాబు, విజ్జగిరి రవితేజ,సున్నం వెంకటరమణ, మోసం సంజీవరావు, తదితర న్యాయవాదులు పాల్గొని విజ్ఞప్తి చేశారు.

కృష్ణవరంలో కన్నులపండువగా ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ







వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన

భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు

భారీగా తరలివచ్చిన గ్రామస్తులు.. విశేషంగా అన్నదానం

ఎటపాక, నవంబర్ 13 (ప్రజాజ్యోతి): ఎటపాక మండలం కృష్ణవరం గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ జరిగింది. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో ఎటుచూసినా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారి ప్రతిష్ఠాపన ఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు కృష్ణవరం గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆచార్యులు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు, మహా మంగళహారతులు సమర్పించారు. మహిళలు, భక్తులు భక్తిపారవశ్యంతో బోనాలను ఎత్తుకుని వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో, పాడిపంటలతో వర్ధిల్లాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవ నిర్వాహకులు భక్తులందరికీ భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవ ఫౌండేషన్ చింతూరు డివిజన్ ధర్మ ప్రచారకులు కరి చిన్న శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందారు.

పీజీ స్పాట్ అడ్మిషన్స్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

పేద విద్యార్థులకు యూనివర్సిటీలో చదువుకునే అవకాశం కల్పించాలి విద్యార్థుల ప్రొవిజినల్ సర్టిఫికెట్స్ వెంటనే ఇవ్వాలి

శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్నటువంటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లు ఎస్కేపి డిగ్రీ కళాశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చెయ్యాలి ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్

పై సమస్యలను పరిష్కారం చెయ్యాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ వీఎన్నార్ జ్యోతి కుమార్ కి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి



గుంతకల్లు నవంబర్ 13 (ప్రజా జ్యోతి): పీజీ స్పాట్ అడ్మిషన్స్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి, పేద విద్యార్థులకు యూని వర్సిటీలో చదువుకునే అవకాశం కల్పించాలని, విద్యార్థుల ప్రొవిజినల్ సర్టిఫికెట్స్ వెంటనే ఇవ్వాలని, శ్రీకృష్ణదేవరా యల విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్నటువంటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలను పరిష్కరిం చాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణం లోని శ్రీ శంకరానంద గిరి డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ (వి.సి.) ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబా టులోకి తీసుకురావాల్సిన బాధ్యత యూనివర్సిటీ అధికారులపై ఉందని అన్నారు. పీజీ స్పాట్ అడ్మిషన్లను రద్దు చేయాల నే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థులకు విశ్వవిద్యాల యంలో చదువుకునే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధం గా విద్యార్థులకు సంబంధిం చిన ప్రొవిజనల్ సర్టిఫికెట్లను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అందజేయాలని, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యా లయ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా గుంతకల్లు పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆర్.ఓ. వాటర్ ప్లాంట్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు విద్యార్థుల భవిష్య త్తును దృష్టిలో ఉంచుకొని యూనివర్సిటీ అధికారులు స్పందించి పై సమస్యలన్నిం టినీ తక్షణమే పరిష్కరించా లని ఏఐఎస్ఎఫ్ నాయకు లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కోశాధికారి యస్వంత్, సూరి, సాయి కిరణ్, వినోద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ చేసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు వినతి



గుంతకల్లు నవంబర్ 13 (ప్రజా జ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో, సర్పంచ్ ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు దర ఖాస్తుదారులు, ఎమ్మార్పీ ఎస్ గుంతకల్లు మండల అధ్యక్షులు మంజునాథ్ మాదిగ, కేస్ లాల్ రెడ్డి శుక్రవారం ఆర్డీవో కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్లు వేసే ప్రతి పౌరుడికి, అభ్యర్థి కి పోలీసుల రక్షణ కల్పించా లని, నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులను ఎవరూ అడ్డుకోకుండా, స్వేచ్ఛగా నామినేషన్లు వేసేలా పోలీసులు మరియు ఎన్నికల సంఘం తగిన భద్రత కల్పించాలని సమాచార హక్కు దరఖాస్తుదారులు ఓటర్ల తరపున ఆర్డీవో ని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మనోజ్, తిమ్మప్ప, రాయల్ అనిల్, పవన్, అభిషేక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల భద్రతపై ప్రజలకు భరోసానిస్తూ పోలీసుల కవాతు

హైపర్ సెన్సిటివ్ గ్రామాల్లోనూ ఫ్లాగ్ మార్చ్.

అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు



గుంటూరు నవంబర్ 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి) రానున్న స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజల్లో భద్రతా నమ్మకాన్ని పెంపొందించేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టెంపూడి, ఆలూరు గ్రామాల్లో, ఫిరంగిపురం మండలంలోని హైపర్ సెన్సిటివ్ గ్రామాలైన గొల్లపాలెం, నుదురుపాడు, పొనుగుపాడులో పోలీసు అధికారులు కవాతు చేపట్టారు.పొన్నూరు రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ శ్రీహరి పోలీసు సిబ్బందితో కలిసి కట్టెంపూడి గ్రామం నుంచి ఫ్లాగ్ మార్చ్ ప్రారంభించి గ్రామంలోని ప్రధాన వీధులు, కూడళ్ల మీదుగా ఆలూరు గ్రామానికి చేరుకుని అక్కడ కూడా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అదేవిధంగా తుళ్లూరు ఎస్‌డీపీఓ మురళీకృష్ణ, ఫిరంగిపురం సీఐ భుజంగారావు ఆధ్వర్యంలో సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది హైపర్ సెన్సిటివ్ గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రధాన వీధులు, ముఖ్య కూడళ్లలో కవాతు చేస్తూ ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు.ఎన్నికల సమయంలో ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక వ్యక్తులను ముందుగానే గుర్తించి బైండోవర్ చర్యలు చేపడుతున్నామని, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు పోలింగ్‌కు ఆటంకం కలిగించే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర పోలీసు నిఘా, పటిష్ట బందోబస్తు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

6వ వార్డులో మహిళల సామూహిక మరుగుదొడ్డిపై ఆక్రమణ యత్నం..!?

మున్సిపల్ అధికారులు స్పందించాలి!



ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు పట్టణంలోని 6వ వార్డులో మహిళల కోసం నిర్మించిన సామూహిక మరుగుదొడ్డి ఆక్రమణకు గురవుతున్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరుగుదొడ్డి అడ్డుగోడను,లోపల గోడలను పగలగొట్టి ఆ స్థలాన్ని వ్యాపార అవసరాలకు వినియోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల అవసరాల కోసం, ముఖ్యంగా మహిళల సౌకర్యార్థం నిర్మించిన సామూహిక మరుగుదొడ్డిని వ్యక్తిగత వ్యాపార అవసరాలకు ఉపయోగించుకునే ప్రయత్నాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని, మరుగుదొడ్డి కూల్చివేత, ఆక్రమణ ప్రయత్నాలపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ఆస్తులను కాపాడి మహిళలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వార్డ్ ప్రజలు కోరుతున్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

-- ఎంపీడీఓ, బి, కిరణ్ మోహన్ రావు



చెన్నూరు, నవంబర్,13,గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా నిర్వహించడంతో పాటు, ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని ఎంపీడీఓ, చెన్నూరు శ్రీ బి. కిరణ్ మోహన్ రావు సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఈరోజు చెన్నూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన సన్నద్ధత, ఎన్నికల నిర్వహణ మరియు మొత్తం ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. చెన్నూరు మండలంలో నామినేషన్ల స్వీకరణ కోసం మొత్తం మూడు క్లస్టర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, అవి 1. చెన్నూరు గ్రామపంచాయతీ, 2. ఉప్పరపల్లి సచివాలయం, 3. ముండ్లపల్లి ఎలిమెంటరీ స్కూల్ అని తెలిపారు. ఆయా క్లస్టర్ల పరిధిలో నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామపంచాయతీల వారీగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాల ఏర్పాటు, అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది కేటాయింపు, ఎన్నికల విధులకు సంబంధించిన బాధ్యతలు, రికార్డుల నిర్వహణ, ఎన్నికల సామగ్రి సిద్ధం చేయడం తదితర అంశాలపై చర్చించారు.అలాగే నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి దశను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఎంపీడీఓ సూచించారు.ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, నామినేషన్ల సమయంలో అవసరమైన పోలీస్ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని సూచించారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, పోలీస్ శాఖకు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ చెన్నూరు మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు (పిడిఓలు) పాల్గొన్నారు.ఎన్నికల విధులను నిర్వహించే ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి, గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియతో పాటు మొత్తం ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కోరారు.

సామాన్యుడి కంట కన్నీరు పెట్టిస్తున్న నిత్యావసర ధరలు!

- నియంత్రణ చర్యలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం.

తక్షణమే రేషన్ షాపుల ద్వారా నిత్యవసర వస్తువులు సబ్సిడీతో పంపిణీ చేయాలి.

- సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ డిమాండ్.



బద్వేల్ స్టాప్ రిపోర్టర్ నవంబర్ 13 (ప్రజా జ్యోతి) సామాన్య పేద మధ్యతరగతి ప్రజల కంటనీరు పెట్టిస్తున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో, సామాన్య ప్రజలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్, నియోజకవర్గ పార్టీ కార్యదర్శి పి చంద్రమోహన్ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం బద్వేల్ పట్టణంలోని భగత్ సింగ్ నగర్ లో గల వారి పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన సమావేశంలో పై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్, పి చంద్రమోహన్ రాజు సంయుక్తంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు రెండింతలు పెరిగి సామాన్య ప్రజల నడ్డి విరుస్తుంటే నివారణ నియంత్రణ చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు అని వారు ఘాటుగా విమర్శించారు. ఉల్లి వెల్లుల్లి వంట నూనెలు పప్పు ధాన్యాలు ధరలు 100% పైబడి పెరిగి సామాన్య మధ్యతరగతి ప్రజలను వెక్కిరిస్తున్నాయని వారిని వంటింటికి దూరం చేస్తున్నా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తూ ఆర్భాటకపు ప్రకటనలు చేస్తూ, లేనిది ఉన్నట్లు భ్రమింపజేస్తూ కాలం గడుపుకుంటున్నారని వారు దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గారు మాట్లాడుతూ యల్ నినోప్రభావంతో రాష్ట్ర ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తక్షణమే రేషన్ షాపుల ద్వారా కందిపప్పు వంటనూనె చక్కెర గోధుమపిండి సబ్సిడీతో అందిస్తామని ప్రగల్భాలు పలికి పత్రికా ప్రకటనలు విడుదల చేసి ఏ ఒక్క రేషన్ షాపులో బియ్యం చక్కెర గోధుమపిండి తప్ప మిగతావి ఇచ్చిన సందర్భాలు లేవని, మీరు చెప్పింది నిజమైతే వచ్చిన సరుకు ఏ దొడ్డి దారిన పోయిందో చెప్పగలరా? లేక రేషన్ షాపు యజమానులు చెప్పినట్లు నిత్యవసర వస్తువులు పంపించడంలో మీ వైఫల్యమా? సమాధానం చెప్పగలరా అని వారు ఘాటుగా ప్రశ్నించారు. సామాన్య పేదల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ప్రత్యేక కౌంటర్ల ద్వారా రేషన్ షాపుల ద్వారా నిత్యవసర వస్తువులు సబ్సిడీతో పంపిణీ చేసి సామాన్య పేద మధ్య తరగతి ప్రజలను ఆదుకోవాలని లేని పక్షంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో రేషన్ షాపుల ఎదుట ఆందోళనలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ కమిటీ సభ్యులు రామరాజు, సంజీవ రాయుడు, కే బాబు, జయరామరాజు, గంటా మహబూబ్ బాషా, ఈశ్వర్, పోతురాజు రమణ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి కంట నీళ్లు తెప్పిస్తున్న నిత్యవసర వస్తువుల ధరలు



గోపవరం నవంబర్ 13 ప్రజా జ్యోతి న్యూస్..... సామాన్య పేద మధ్యతరగతి ప్రజల కంటనీరు పెట్టిస్తున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో సామాన్య ప్రజలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్, నియోజకవర్గ పార్టీ కార్యదర్శి పి చంద్రమోహన్ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం బద్వేల్ పట్టణంలోని భగత్ సింగ్ నగర్ లో గల వారి పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన సమావేశంలో పై విధంగా స్పందించారు.ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్, పి చంద్రమోహన్ రాజు సంయుక్తంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు రెండింతలు పెరిగి సామాన్య ప్రజల నడ్డి విరుస్తుంటే నివారణ నియంత్రణ చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు అని వారు ఘాటుగా విమర్శించారు. ఉల్లి వెల్లుల్లి వంట నూనెలు పప్పు ధాన్యాలు ధరలు 100% పైబడి పెరిగి సామాన్య మధ్యతరగతి ప్రజలను వెక్కిరిస్తున్నాయని వారిని వంటింటికి దూరం చేస్తున్నా . పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తూ ఆర్భాటకపు ప్రకటనలు చేస్తూ, లేనిది ఉన్నట్లు భ్రమింపజేస్తూ కాలం గడుపుకుంటున్నారని వారు దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గారు మాట్లాడుతూ యల్ నినోప్రభావంతో రాష్ట్ర ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తక్షణమే రేషన్ షాపుల ద్వారా కందిపప్పు వంటనూనె చక్కెర గోధుమపిండి సబ్సిడీతో అందిస్తామని ప్రగల్భాలు పలికి పత్రికా ప్రకటనలు విడుదల చేసి ఏ ఒక్క రేషన్ షాపులో బియ్యం చక్కెర గోధుమపిండి తప్ప మిగతావి ఇచ్చిన సందర్భాలు లేవని, మీరు చెప్పింది నిజమైతే వచ్చిన సరుకు ఏ దొడ్డి దారిన పోయిందో చెప్పగలరా .లేక రేషన్ షాపు యజమానులు చెప్పినట్లు నిత్యవసర వస్తువులు పంపించడంలో మీ వైఫల్యమా .సమాధానం చెప్పగలరా అని వారు ఘాటుగా ప్రశ్నించారు. సామాన్య పేదల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ప్రత్యేక కౌంటర్ల ద్వారా రేషన్ షాపుల ద్వారా నిత్యవసర వస్తువులు సబ్సిడీతో పంపిణీ చేసి సామాన్య పేద మధ్య తరగతి ప్రజలను ఆదుకోవాలని లేని పక్షంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో రేషన్ షాపుల ఎదుట ఆందోళనలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు.ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ కమిటీ సభ్యులు రామరాజు..సంజీవ రాయుడు.కే బాబు, జయరామరాజు, గంటా మహబూబ్ బాషా, ఈశ్వర్, పోతురాజు రమణ తదితరులు పాల్గొన్నారు.

తుపాను నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కేంద్ర బృందం



బాపట్ల నవంబర్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మురసు తుపాను కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంటలు, రహదారులు, సాగునీటి కాల్వలు, మత్స్యకారుల పడవలు, నివాస గృహాలను అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. బాపట్ల, చీరాల, చినగంజాం, కారంచేడు, పర్చూరు ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడి నష్టాల వివరాలను సేకరించింది.బాపట్ల మండలం జమ్ములపాలెంలో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంది. చీరాల మండలం ఓడరేవులో దెబ్బతిన్న మత్స్యకారుల పడవలను పరిశీలించిన సందర్భంగా హార్బర్ ఏర్పాటు చేయాలని మత్స్యకారులు కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ హార్బర్ నిర్మాణానికి భూసేకరణ చేసి ప్రతిపాదనలు పంపామని, అనుమతులు రాగానే పనులు చేపడతామని వివరించారు.చినగంజాం మండలం కడవకుదురులో ఉద్యాన పంటల నష్టాన్ని, కారంచేడులో కొమ్మూరు కాలువ, రహదారులు, సాగునీటి వ్యవస్థలకు జరిగిన నష్టాన్ని బృందం పరిశీలించింది. పర్చూరు ఇందిరా కాలనీలో తుపానుకు నేలమట్టమైన ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలతో మాట్లాడింది. నిరాశ్రయులైన కుటుంబాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్లు నిర్మించాలని అధికారులకు సూచించింది. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలు, జిల్లా యంత్రాంగం అందించిన నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించి బాధితులకు సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని బృందం సభ్యులు తెలిపారు.ఈ పర్యటనలో కేంద్ర బృందం నాయకుడు చిత్తరంజన్ దాస్, సభ్యులు ప్రశాంత్ ఆర్మోరికర్, హిమాలయ గార్గ్, ప్రణయ్ గార్గ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ఎండీ ప్రఖర్ జైన్, జిల్లా అధికారులు, బాపట్ల, చీరాల రెవెన్యూ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

మురసు తుపాను నష్టాలను కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లిన ఏలూరి



పర్చూరు నవంబరు 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) మురసు తుపాను పర్చూరు నియోజకవర్గంలో తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని, దెబ్బతిన్న వ్యవసాయం, రహదారులు, విద్యుత్తు, తాగునీటి వ్యవస్థల పునరుద్ధరణకు రూ.202.87 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కేంద్ర బృందాన్ని కోరారు. తుపాను నష్టాల పరిశీలనకు వచ్చిన కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందానికి నియోజకవర్గంలో జరిగిన నష్టాలను వివరించారు.కొమ్మమూరు కాలువకు 55 చోట్ల గండ్లు పడటంతో పంటలు దెబ్బతిన్నాయని, 5,962 ఇళ్లు దెబ్బతినగా పశుసంపదకు కూడా భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. రహదారుల పునరుద్ధరణకు రూ.64.13 కోట్లు, వరద కాలువలు, డ్రైనేజీల ఆధునికీకరణకు రూ.95 కోట్లు అవసరమని వివరించారు.ఏటా వరదలతో ముంపునకు గురవుతున్న పర్చూరు ప్రాంతానికి శాశ్వత పరిష్కారం చూపాలని, పూడికతో నిండిన కాలువలను అభివృద్ధి చేయాలని కోరారు. 12 రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి రద్దయిన రూ.38.74 కోట్ల నిధులను తిరిగి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుమారు 4,500 విద్యుత్తు స్తంభాలు నేలకూలాయని, నీట మునిగిన పంటలకు నష్టపరిహారం అందించాలని కోరారు.కేంద్ర బృందంలో చిత్తరంజన్ దాస్, ప్రశాంత్ ఆర్మోరికర్, హిమాలయ గార్గ్, ప్రణయ్ గార్గ్ పాల్గొనగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ పాల్గొన్నారు.

టమోటా విలువాధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ రైతులకు ప్రత్యక్షంగా తయారీ విధానాలపై అవగాహన



ఎమ్మిగనూరు,నవంబర్ 13 (ప్రజా జ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), బనవాసి ఆధ్వర్యంలో టమోటా విలువాధారిత ఉత్పత్తుల తయారీపై గురువారం హ్యాండ్స్-ఆన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 25 మంది ఔత్సాహిక రైతులు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె. రవీంద్ర చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో టమోటా సాగుకు విస్తృత అవకాశాలు ఉన్నప్పటికీ, విలువాధారిత ఉత్పత్తుల తయారీ 5 శాతం కంటే తక్కువగా ఉందన్నారు. టమోటా ప్యూరీ, కెచప్, ఫ్లేక్స్, పొడి తయారీ ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతులు ఎఫ్‌పీఓలుగా ఏర్పడి పీఎంఎఫ్ఎంఈ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించుకోవాలని సూచించారు. అనంతరం టీసీ రామచంద్రన్న ఎఫ్‌పీఓల ఏర్పాటు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం టమోటా ప్యూరీ, కెచప్, ఫ్లేక్స్ తయారీ విధానాలపై రైతులకు ప్రత్యక్ష ప్రాక్టికల్ డెమాన్స్ట్రేషన్ నిర్వహించి శిక్షణ ఇచ్చారు.

ఇది ప్రజావిజయం!.. అభివృద్ధికి నిదర్శనం!..

నావెంటమీరున్నారు ఈఐదేళ్లు మీవెంటనేనుంటా!..
సన్మానకార్యక్రమంలో ఎం.పి.టి.సి,గొంది చంద్రయ్య!..

వరరామచంద్రాపురం, నవంబర్ 13 (ప్రజాజ్యోతి ప్రతినిధి) నావెంట మీరుండి అద్భుతమైనవిజయాన్ని అందించారు. మీ వెంట ఈ ఐదేళ్లు నేనుంటానని, సీనియర్ నాయకులు,సొసైటీ చైర్మన్ గొంది చంద్రయ్య, సూచించారు. శుక్రవారం బి.సి, కాలనీలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వడ్డీగూడెం పంచాయతీ, ఎం.పి.టి.సి,పరిధిలో అద్భుతమైన మెజారిటీతో విజయాన్ని సాధించిన సీనియర్ నాయకులు సొసైటీ ప్రెసిడెంట్ గొంది చంద్రయ్యను, బి.సి,కాలనీ ప్రజలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం తెలుగు దేశం పార్టీ, మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా, ఎం.పి.టి.సి, గొంది చంద్రయ్య ,మాట్లాడుతూ నన్ను మీవాడిగా భావించి అద్భుతమైన మెజారిటీతో గెలిపించారు. ఈ ఐదేళ్లు సేవచేసి మీరుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. మీకే చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిస్కారం చేస్తానని,మన శాసన సభ్యురాలు మిర్యాల శిరీషాదేవి, దృష్టికి తీసుకువెళ్లి పరిస్కారం దిశగాఅడుగులు వేస్తానని పేర్కొన్నారు. సీనియర్లు, జూనియర్లు, మహిళలు, యూత్, కలిసి నావిజయానికి కృషిచేశారని గుర్తుచేశారు.మీ





అందరికీ అంతరకర్మశుద్ధితో పనిచేసి అండగాఉంటానని హామీ ఇచ్చారు. నావిజయం వెనుకమీరున్నారు. మీముందుండి మీకునేను సేవచేస్తానని వివరించారు. నావిజయంలో భాగస్వామ్యంమైన, ప్రతీ అక్కకు, ప్రతీచెల్లికి, అవ్వలకు, తాతలకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ప్రజల హర్ష ద్వానాల మధ్య సన్మాన కార్యక్రమందే దీవ్యమానంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వడ్డిగూడెం, వరరామచంద్రాపురం, బి.సి,కాలనీ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

నాగుల చవితి వేడుకలు.. పుట్టల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు!

కుటుంబ సమేతంగా నాగదేవతలకు మహిళల పూజలు.. ఆలయాలు, పంట పొలాల్లో ఆధ్యాత్మిక సందడి!

పిఠాపురం (ప్రజా జ్యోతి) కార్తీక మాసం తొలి పర్వదినమైన నాగుల చవితిని పురస్కరించుకుని పిఠాపురం నియోజకవర్గంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజాము నుంచే మహిళలు, చిన్నారులు కుటుంబ సమేతంగా ఆలయాలకు, పుట్టల వద్దకు చేరుకుని నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా శివాలయాలు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో పచ్చని పంట పొలాల గట్లపై ఉన్న పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నాగ ప్రతిమలకు పసుపు, కుంకుమ సమర్పించి, పుట్టల్లో ఆవుపాలు పోసి తమ కుటుంబాల క్షేమం కోసం ప్రార్థించారు. కోడిగుడ్లు, నువ్వుల పప్పు, చిమ్మిలి, చలివిడి తదితర నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.గొల్లప్రోలు పట్టణంలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నాగుల చవితి పూజల కోసం ఆలయ కమిటీ ప్రత్యేకంగా పుట్టలను ఏర్పాటు చేసింది. దీంతో పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టల వద్ద నాగదేవతలను పూజించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను





సంతరించుకుంది.

నాగదేవతల ఆరాధనతో సుఖసంతోషాలు కలుగుతాయనే విశ్వాసం

నాగుల చవితి రోజున నాగదేవతలను, సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తితో ఆరాధించడం వల్ల సర్పదోషాలు తొలగిపోతాయని, సంతాన భాగ్యం కలుగుతుందని, కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ముఖ్యంగా రావి, వేప చెట్ల సమీపంలోని నాగ ప్రతిమలకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా పండుగను పురస్కరించుకుని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో పిఠాపురం నియోజకవర్గంలోని ఆలయాలు, గ్రామీణ ప్రాంతాలు భక్తి భావంతో కళకళలాడాయి.

గోవిందరెడ్డి వ్యక్తిత్వం ఏంటో ప్రజలకు తెలుసు

ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ

గోపవరం నవంబర్ 13 ప్రజా జ్యోతి న్యూస్..... బద్వేలు నియోజకవర్గంలో గత 25 ఏళ్లుగా ఎటువంటి కక్షలు, కార్పన్యాలు లేకుండా సుపరిపాలన అందించిన గోవింద రెడ్డి వ్యక్తిత్వం ఏమిటో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా పేర్కొన్నారు.ఇటీవల టిడిపి నేతలు ప్రెస్ మీట్ పెట్టి గోవింద రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. శుక్రవారం ఎన్జీవో కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఆమె మాట్లాడుతూ ఒకసారి ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల ఆధారాభిమానాలు చూరగొన్న నేత గోవింద రెడ్డి ఆని అన్నారు.అందుకే గత 25 ఏళ్లుగా నియోజకవర్గంలోని ప్రజలు అన్ని ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి అభ్యర్థులకు పట్టం కడుతూ వస్తున్నారని అన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో 2019- 2024 మధ్యకాలంలో మునుపెన్నడూ లేనివిధంగా బద్వేలు నియోజకవర్గాన్ని రూ.400 కోట్లతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. బద్వేలు నియోజకవర్గ అభివృద్ధి, నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా గోవిందరెడ్డి పాలన అందించారని.. ఆ విషయం నియోజకవర్గంలోని ఏ ఒక్కరిని అడిగినా చెబుతారని అన్నారు. గడచిన 25 ఏళ్ల కాలంలో నియోజకవర్గంలో ఏ ఒక్క ప్రతిపక్ష నేతనైనా గోవిందరెడ్డి ఇబ్బందుల గురిచేసారి అని గాని, ఎన్నికలలో అక్రమాలకు అరాచకాలకు పాల్పడ్డార అని గాని ఎక్కడైనా జరిగి ఉంటే తెలపాలని ఆమె ప్రశ్నించారు. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారిగా సేవలు అందించిన ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా అదే హుందా తనంతో పాలన అందించారని ఏ ఒక్క ప్రభుత్వ అధికారిని కూడా



తక్కువ చేసి మాట్లాడిన చరిత్ర లేదని అన్నారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికలలో అప్రజాస్వామ్య విధానాలకు పాల్పడి, అరాచకాలు సృష్టించి ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను నామినేషన్ సైతం వేయకుండా అడ్డుకున్నారని అన్నారు.బద్వేలు నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీ కంచుకోట అని ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు జరిగితే వైఎస్ఆర్ సీపీ అభ్యర్థుల విజయాన్ని ఎవరు కూడా ఆపలేరు అనే విషయాన్ని టిడిపి నేతలు గుర్తించాలని కోరారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించి గెలుపొందితే ఎవరి సత్తా ఏమిటో తెలుస్తుందని అన్నారు.

హమాలీ మూర్తుజా కుటుంబాన్ని పరామర్శించిన పట్టణ అధ్యక్షులు షేక్ మన్సూర్



ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు పట్టణంలోని 13వ వార్డు శేషశయనారెడ్డి నగర్‌కు చెందిన హమాలీ మూర్తుజా (52) నిన్న రాత్రి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ మన్సూర్ అహ్మద్ 13వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్లా బేగ్ వైసీపీ నాయకులు మార్కెట్ రాజు,చాంద్ బాషా తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మూర్తుజా మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కష్ట సమయంలో కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాబు, రహంతుల్లా, సమీర్, విజ్జి తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కట్టుబడిపాలెం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా... యువ నేత లకావత్ వెంకట ప్రసాద్ నాయక్..!!

ఈనెల 15వ తేదీ ఆదివారం గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు...తేలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు నామినేషన్ కు తరఓ రండి....!!

గ్రామ సర్పంచ్ అభ్యర్థి లకావత్ వెంకట ప్రసాద్ నాయక్ పిలుపు...!!

జి.కొండూరు :(సెప్టెంబర్ 13,,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు): ఈనెల 26వ తేదీన జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో జి.కొండూరు మండల పరిధిలోని కట్టుబడిపాలెం గ్రామ సర్పంచ్ గా తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న... తెలుగుదేశం పార్టీ యువనేత లకావత్ వెంకటప్రసాద్ నాయక్ పోటీ చేస్తున్నారు.ఈ తరణంలో ఈనెల 15వ తేదీ ఆదివారం గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల దీవెనలతో తెలుగుదేశం పార్టీ నాయకుల కార్యకర్తల ఆశీస్సులతో.... నామినేషన్ వేనున్నట్లు సర్పంచ్ అభ్యర్థి లకావత్ వెంకటప్రసాద్ నాయక్ శుక్రవారం పత్రికా ముఖంగా తెలిపారు. మొదటి నుండి తెలుగుదేశం పార్టీలో చురుకైన పాత్ర వహిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ,గ్రామంలో అందర్నీ కలుపుకొని మంచి మనసున్న మనిషిగా విద్యావంతులుగా....వ్యాపారవేత్తగా రాజకీయాల పై మంచి అవగాహన కలిగిన రాజకీయ యువనేతగా వెంకట ప్రసాద్ నాయక్ ప్రజల్లో మంచి గుర్తింపు పొందడని గ్రామంలో పలువురు టిడిపి నేతలుకార్యకర్తలు వారి అభిప్రాయాలను వ్యక్త పరుస్తున్నారు. గ్రామ సర్పంచ్ గా వెంకట ప్రసాద్ నాయక్ గెలుపొందితే కట్టుబడిపాలెం గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తాడని వెంకటప్రసాద్ నాయక్ పై గ్రామ ప్రజల ఓటర్లలో మంచి నమ్మకం ఉందని వెంకటప్రసాద్ నాయక్ గెలుపొందడం ఖాయమని పలువురు టిడిపి నాయకులు బహిరంగానే చెబుతుండడం విశేషంగా చెప్పవచ్చు.... ఈ సందర్భంగా సర్పంచ్ గా పోటీ చేస్తున్న లకావత్ వెంకటప్రసాద్ నాయక్ ని ప్రజా జ్యోతి బ్యూరో వివరణ కోరగా... ఈ సందర్భంగా వెంకట ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ... తాను రాజకీయాల్లో మొదటి నుండి తెలుగుదేశం పార్టీలో పనిచేశానని తన సతీమణి లకవత్ వాసవి ఎంపిటిసి మెంబర్ గా గతంలో గెలుపొందడం జరిగిందన్నారు. తాను సర్పంచ్ గా కట్టుబడిపాలెం గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని అలాగే కాలుష్యా నియంత్రణకు కృషి చేస్తానని తెలిపారు . అలాగే గ్రామాస్తులు ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని... విజయవంతం చేయాలని కోరుతున్నట్లు లకావత్ వెంకటప్రసాద్ నాయక్ పత్రికా ముఖంగా తెలిపారు.



సురక్షిత బాల్యం, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు.





ఆలమూరు నవంబర్ 13 (ప్రజాజ్యోతి): ఆలమూరు మండలంలోని కొత్తూరు, మూలస్థానం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సురక్షిత బాల్యం, బాలల రక్షణ ఉద్యమం మరియు బాల్యవివాహాల నివారణపై అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ, జిల్లా స్థాయి న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి ఐ. ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) బూసి విద్యా ప్రసన్న మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను, చట్టపరమైన శిక్షలను వివరించారు.పిల్లల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ముప్పిరి వెంకయ్య, పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కౌతాళం సర్పంచ్ బరిలో వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి సతీమణి శివమ్మ!

:-గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఎన్నికల బరిలోకి.. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా!

:-ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద ఆచారి ఆధ్వర్యంలో అభ్యర్థిత్వం

కౌతాళం, నవంబర్ 13 ప్రజా జ్యోతి కౌతాళం గ్రామ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సందడి నెలకొంది.వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి సతీమణి శివమ్మ వైసీపీ అభ్యర్థిగా సర్పంచ్ బరిలో నిలుస్తున్నారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద ఆచారి ఆధ్వర్యంలో శివమ్మ ఎన్నికల పోటీకి సిద్ధమయ్యారు.



గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం!

కౌతాళం గ్రామ ప్రజలు తమకు అవకాశం కల్పించి గెలిపిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని శివమ్మ తెలిపారు.గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

శివమ్మ ప్రధానంగా ప్రస్తావిస్తున్న సమస్యలు ఇవే!

తాగునీటి సమస్య: ప్రతి వీధికి సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవడం.

డ్రైనేజీ సమస్య: మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం.

రోడ్ల అభివృద్ధి: గ్రామంలోని అంతర్గత రహదారుల సమస్యలను పరిష్కరించడం.

వీధి దీపాలు: అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటు, మరమ్మతులు.

పారిశుద్ధ్యం: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు.

ప్రజా సమస్యలు: గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేయడం.

ప్రజల సహకారంతో కౌతాళం అభివృద్ధికి కృషి!

గ్రామంలోని ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని శివమ్మ తెలిపారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు,పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, వారి సహకారంతో కౌతాళం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని బుజ్జి స్వామి తెలిపారు.

తాడిపూడి సర్పంచ్ బరిలో కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి సుధీర్ కుమార్ తల్లి అరవాలమ్మ ఖరారు

తాళ్లపూడి, నవంబర్ 13, ప్రజాజ్యోతి న్యూస్ తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కూటమి తరఫు జనసేన పార్టీ నుంచి లింగంపల్లి సుధీర్ కుమార్ తల్లి లింగంపల్లి అరవాలమ్మ బరిలో నిలవనున్నారు. ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఆమెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు కొవ్వూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ టీవీ రామారావు తాడిపూడి గ్రామ జనసేన నాయకులు కొలుకుల సత్య నారాయణ(పెద్దబ్బులు) ప్రకటించారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వస్తున్న సుధీర్ కుమార్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కీలక పాత్ర పోషించారు. గ్రామంలో పార్టీని బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. యువతతో మంచి సత్సంబంధాలు కలిగిన సుధీర్ కుమార్ యువతనందరినీ కలుపుకుని వెళ్లే వ్యక్తిగా గుర్తింపు పొందారు. గ్రామంలో యువతకు అండగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారు.



సుధీర్ కుమార్ తండ్రి గతంలో సర్పంచ్ గా పనిచేసిన అనుభవం కలిగిన వ్యక్తి. రాజకీయ అనుభవం ఉన్న కుటుంబం కావడం పార్టీ కోసం సుధీర్ చేసిన కృషి, యువత మద్దతు ఈ అంశాలన్నీ అరవాలమ్మకు కలిసి వస్తాయని గ్రామస్తులు భావిస్తున్నారు. ఆమెకు మద్దతుగా కూటమి పార్టీలన్నీ ఏకమయ్యాయి. కూటమి బలంతో అరవాలమ్మ ఘన విజయం సాధిస్తారని కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు



తాడిపూడి గ్రామంలో ఆత్మీయ సమావేశం

. కూటమి తరపు సర్పంచ్ అభ్యర్థి ప్రకటన

. గ్రామానికి ఉచిత ఫ్రీజర్, అంబులెన్స్ సేవలు సుధీర్ కుమార్ వెల్లడి





తాళ్లపూడి, నవంబర్ 13, ప్రజాజ్యోతి న్యూస్ తాడిపూడి గ్రామంలో కూటమి హోరు గ్రామ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో ఆత్మీయ సమావేశం అట్టహాసంగా జరిగింది. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సభా ప్రాంగణం జనసంద్రంగా మారిపోయింది. ఈ సందర్భంగా కూటమి తరపున జనసేన పార్టీ నుంచి సర్పంచ్ అభ్యర్థిగా లింగంపల్లి అరవాలమ్మను అధికారికంగా ప్రకటించారు.ప్రకటన వెలువడగానే సభలో చప్పట్లు, కేరింతలతో మారుమోగిపోయింది ఇటీవల తాడిపూడి ఎంపీటీసీ ఎన్నికలో ఏకగ్రీవంగా సహకరించినందుకు గ్రామస్తులందరికీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీపీ అభ్యర్థి నామా కొండబాబు శంకరరాణి దంపతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ పాత్ర కీలకమని మీరందరూ అరవాలమ్మను ఓటు వేసి గెలిపిస్తే మండల పరిషత్ నుంచి భారీ నిధులు తీసుకువచ్చి తాడిపూడిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం" అని నామా కొండబాబు స్పష్టం చేశారు. ఆయన మాటలకు గ్రామస్తుల నుంచి అపూర్వ స్పందన లభించింది. కొలుకుల సత్యనారాయణ (పెద్దబ్బులు) మాట్లాడుతూ "జనసేన పార్టీ తరపున అరవాలమ్మను అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది. ప్రజలందరూ సహకరించి అఖండ మెజారిటీతో గెలిపించాలి" అని పిలుపునిచ్చారు.సుధీర్ కుమార్ మాట్లాడుతూ గ్రామస్తులకు శుభవార్త చెప్పారు. "గ్రామానికి ఉచితంగా ఫ్రీజర్, అంబులెన్స్ సేవలను అందిస్తాను" అని ప్రకటించగానే సభలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రజా సేవలో సుధీర్ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని గ్రామస్తులు కొనియాడారు. తిరుమల శెట్టి అన్నవరం మాట్లాడుతూ "గ్రామ అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా మంచి వ్యక్తిని అభ్యర్థిగా బరిలో దించాం. అభివృద్ధి జరగాలంటే అరవాలమ్మకే ఓటు వేయాలి" అని కోరారు ఈ కార్యక్రమంలో భారీగా గ్రామస్తులు పాల్గొన్నారు

బేతనీ కాలనీ బాధితులకు అండగా నిలిచిన సీఐ రాంబాబు



బాపట్ల నవంబర్ 13 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) ఇటీవల కురిసిన భారీ వర్షాలు, మురుసు తుపాను ప్రభావంతో ఆశ్రయం కోల్పోయిన బేతనీ కాలనీలోని కుష్ఠు వ్యాధిగ్రస్తులకు ఏపీ స్టేట్ లెప్రా సొసైటీ అండగా నిలిచింది. సొసైటీ సహకారంతో కాలనీలో నివసిస్తున్న 135 మంది బాధితులకు బ్రెడ్, బిస్కెట్ ప్యాకెట్లు, తాగునీటి సీసాలు, పాల ప్యాకెట్లను బాపట్ల పట్టణ సీఐ ఆర్. రాంబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీఐ రాంబాబు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, తుపానుల సమయంలో కష్టాల్లో ఉన్న కుష్ఠు వ్యాధిగ్రస్తులకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్న లెప్రా సొసైటీ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆపద సమయంలో బాధితులకు అండగా నిలవడం సామాజిక బాధ్యతకు నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో లెప్రా సొసైటీ అసోసియేట్ భాష, బేతనీ కాలనీ సంఘ పెద్దలు, సోషల్ వర్కర్ ఎస్. జాన్ తదితరులు పాల్గొన్నారు.

బాలుపల్లిలో ఎన్నికల ప్రశాంత నిర్వహణపై పోలీసుల అవగాహన సమావేశం



చింత కొమ్మ దిన్నె ప్రజాజ్యోతి 13/11/26 రానున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో బాలుపల్లి గ్రామంలో చింతకొమ్మదిన్నె సర్కిల్ ఇన్స్పెక్టర్ బాల మద్దిలేటి గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఎన్నికలపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పాపాసాహెబ్‌పేట పంచాయతీ పరిధిలోని బాలుపల్లి గ్రామంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బాల మద్దిలేటి మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ పోరులో.. నిలిచేదెవరు.. నెగ్గేదెవరు.?

- ప్రచారంలో పలువురు ఆశావహులు

- పోటీకి సిద్ధమవుతున్న మరి కొందరు



(ప్రజా జ్యోతి న్యూస్ ప్యాపిలి) నవంబర్ 13 పంచాయతీ ఎన్నికల నగారా మోగకముందే ప్యాపిలి మండలంలో రాజకీయ సందడి మొదలైంది. గ్రామ సర్పంచి పదవులను దక్కించుకోవాలనే ఆశతో పలువురు స్థానిక నాయకులు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. తమకున్న ప్రజాబలం, రాజకీయ పలుకుబడి, కుటుంబ నేపథ్యం, సామాజిక సమీకరణాలను అంచనా వేసుకుంటూ ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలపై ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. గతంలో గ్రామ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన కుటుంబాలతోపాటు, స్థానికంగా గుర్తింపు పొందిన నాయకుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. మరోవైపు యువ నాయకత్వం సైతం సర్పంచి పదవిపై ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వ్యాపార, రాజకీయ రంగాల్లో చురుకుగా ఉంటూ టీడీపీలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఓ యువ నాయకుడు ప్రస్తుతం గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన కుటుంబం నుంచి ఎవరైనా సర్పంచి బరిలో దిగుతారా అన్న చర్చ నడుస్తోంది. అలాగే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓ కుటుంబం నుంచి పోటీ చేసే అవకాశాలున్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది.ఇలా పాత రాజకీయ కుటుంబాలు, స్థానిక నాయకులు, యువతలో పలువురు ఆశావహులుగా కనిపిస్తున్నప్పటికీ, వారిలో ఎంత మంది నిజంగా ఎన్నికల బరిలో నిలుస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత రిజర్వేషన్లు, రాజకీయ మద్దతు, గ్రామ పెద్దల నిర్ణయాలు, ప్రజాభిప్రాయం ఆధారంగా అసలు సమీకరణాలు మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆశావహుల పేర్లతో సాగుతున్న చర్చలు రానున్న రోజుల్లో మరింత వేడెక్కనున్నాయి. ఇంతకీ పంచాయతీ పోరులో నిలిచేదెవరు? ప్రజల ఆదరణతో సర్పంచి పీఠాన్ని దక్కించుకునేదెవరు? అన్నది వేచి చూడాల్సిందే.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఏబీ ఫౌండేషన్ తక్షణ ఆపన్నహస్తం!

సర్వం కోల్పోయిన బొడ్డు వీరయ్య కుటుంబానికి అండగా నిలిచిన ఏబి ఫౌండేషన్.....

25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు, దుస్తులు, వంట సామగ్రి పంపిణీ...

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఏబీ ఫౌండేషన్ పూర్తి భరోసా.....

ముఖ్య అతిథులుగా స్థానిక ఎంపీటీసీ సోడే రమాదేవి...







కూనవరం: నవంబర్ 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి కిరణ్ బాబు):ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఏబీ ఫౌండేషన్ నిరంతరం ప్రజాసేవలో నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంది.ఏబి ఫౌండేషన్ చైర్మన్ కుంజా అనిల్ ఆధ్వర్యంలో కూనవరం మండలం చినార్కూర్ పంచాయతీ, పండ్రాజుపల్లి గ్రామస్తుడైనా బొడ్డు.వీరయ్య ఇల్లు కరెంట్ షాట్ సర్క్యూట్వల్ల పూర్తిగా దగ్ధమై ఇంట్లోని సామగ్రి అంతా కాలిబూడిదైంది. ఈ విషయం తెలుసుకున్న ఏబీ ఫౌండేషన్ చైర్మన్ అనిల్ బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకొచ్చి,తన టీమ్ తో స్థానిక జనసేన ఎంపీటీసీ సోడే రమాదేవి ని ముఖ్య అతిథిగా పిలిచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, కూరగాయలు, పండ్లు, దుప్పట్లు, వంట పాత్రలు సుమారు 3000 రూపాయల విలువుగల నిత్యావసర వస్తువులను తన చేతుల మీదుగా పంపిణీ చేశారు.కష్టకాలంలో ఉన్న కుటుంబానికి తక్షణ అవసరాలను గుర్తించి సహాయం అందించడం ద్వారా ఫౌండేషన్ తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. పేదల ఆకలి తీర్చడం, ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలవడం ఏబీ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా అనిల్ పేర్కొన్నారు. అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయిన తమ కుటుంబానికి కష్ట సమయంలో అండగా నిలిచి నిత్యావసర వస్తువులు అందించిన ఏబీ ఫౌండేషన్‌కు బొడ్డు వీరయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సోడే ముత్తయ్య, అధ్యక్షులు కొమర్రాజు . కిరణ్ బాబు, మచ్చ వినయ్ ప్రసాద్, సోడే, రామకృష్ణ, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి... అభివృద్ధి చేసి చూపిస్తాం!

కౌతాళం గ్రామ అభివృద్ధే మా లక్ష్యం

సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు, సర్పంచ్ అభ్యర్థి అల్లూరి నాగమణి

వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభం







కౌతాళం నవంబర్ 13 ప్రజా జ్యోతి కౌతాళం: గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి అల్లూరి నాగమణి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో శుక్రవారం సర్పంచ్ అభ్యర్థి అల్లూరి నాగమణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, గ్రామ అభివృద్ధికి తమకు ఒక అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా అల్లూరి వెంకటపతి రాజు, అల్లూరి నాగమణి మాట్లాడుతూ “ఒక్క అవకాశం ఇవ్వండి... అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం. గ్రామ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కౌతాళం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాం” అని అన్నారు. గ్రామంలో ఎక్కడ ఏ సమస్య ఉందో తమకు పూర్తిస్థాయిలో తెలుసునని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా గుర్తించామని తెలిపారు. కేవలం పదవుల కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచామని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు.

ముఖ్యంగా:

ప్రతి ఇంటికీ మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కృషి. గ్రామంలోని రహదారుల అభివృద్ధి, మరమ్మతులకు ప్రాధాన్యత. డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి మురుగునీటి పారుదలకు చర్యలు. ప్రతి వీధిలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ. గ్రామంలో నిరంతర పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి కృషి. గ్రామంలోని ప్రతి వార్డు, ప్రతి వీధి అభివృద్ధి చెందేలా కృషి చేస్తామని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ముందుగా కౌతాళంలోని ప్రసిద్ధ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు తీసుకుని గ్రామ ప్రజల సంక్షేమం, సుఖసంతోషాలు, గ్రామ అభివృద్ధి కోసం ప్రార్థించారు. అనంతరం ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, తెలుగు తమ్ముళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచార కార్యక్రమానికి మద్దతు తెలిపారు. “ప్రజల ఆశీర్వాదం, సహకారంతో కౌతాళం గ్రామాన్ని అభివృద్ధి చెందిన గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం. ప్రజలందరూ తమ విలువైన ఓటును వేసి అల్లూరి నాగమణిని గెలిపించాలని” అల్లూరి వెంకటపతి రాజు, అల్లూరి నాగమణి ప్రజలను కోరారు.



చిప్పగిరి సర్పంచ్ రేసులో తిమ్మారెడ్డి కుటుంబం..!







నుంచి బరిలోకి దిగనున్న పెద్ద కోడలు కీర్తిశేషులు నందకిషోర్ రెడ్డి సతీమణి లిఖిత రెడ్డి

చిప్పగిరి నవంబర్ 12 (ప్రజా జ్యోతి): చిప్పగిరి గ్రామ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో తిమ్మారెడ్డి కుటుంబం పేరు మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. తిమ్మారెడ్డి పెద్ద కోడలు లిఖిత రెడ్డి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.గతంలో తిమ్మారెడ్డి మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మలతో అత్యంత సన్నిహితంగా మెలిగేవారని స్థానికులు చెబుతున్నారు. ఆ సమయంలో ఆయన కుటుంబం ఎంపీటీసీ, సర్పంచ్ వంటి పలు ప్రజాప్రతినిధి పదవులను చేపట్టి గ్రామ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. అనంతరం సురేష్‌రెడ్డి కూడా మాజీ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు.ఇలా గతంలో పలు పదవులను చేపట్టి గ్రామ రాజకీయాల్లో గుర్తింపు పొందిన ఈ కుటుంబం నుంచి మరోసారి మహిళా నాయకత్వం తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. తిమ్మారెడ్డి పెద్ద కోడలు కీర్తిశేషులు నందకిషోర్ రెడ్డి సతీమణి లిఖితారెడ్డి సర్పంచ్‌గా పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుండట

కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ పదవి వాల్మీకులకే కేటాయించాలి

వాల్మీకి ముద్దుబిడ్డ ఉలిగయ్య



హోలహర్వి మండలం నవంబర్ 13, ప్రజాజ్యోతి న్యూస్:- కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని వాల్మీకులకే కేటాయించాలని వాల్మీకి నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ. ప్రజలారా, వాల్మీకి సోదరులారా, అనేక సంవత్సరాలుగా ఎంతోమంది చైర్మన్ గా నియమితులయ్యారు. గతంలో కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడుకు అవకాశం వచ్చి తృటిలో తప్పిపోయింది. ఈసారైనా కచ్చితంగా వాల్మీకులకే కేటాయించాలని కోరారు. కౌతాళం మండలం నుండి గెలుపొందిన జడ్పీటీసీ అభ్యర్థి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు , వాల్మీకి ముద్దుబిడ్డ ఉలిగయ్యకే ఈ జెడ్పీ చైర్మన్ పదవి కేటాయించాలని ఆయన కోరారు.తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుండి ఈరోజు వరకు పట్టిన జెండా విడవకుండా, అధిష్టానం ఏది ఆదేశిస్తే అది అమలు చేస్తూ వచ్చిన క్రమశిక్షణ కలిగిన సీనియర్ నాయకుడికి ఈ చైర్మన్ పదవి దక్కాలని వాల్మీకులతో పాటు బీసీ నేతలందరూ కోరుతున్నారని తెలిపారు.ఈ సమావేశంలో హోలహర్వి మండల వాల్మీకి నాయకులు గాదిలింగప్ప, శేఖర్, ఈరన్న, పచ్చారపల్లి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో నేరేడుచర్ల గ్రామ ప్రజలకు యన్. రాచర్ల ,ఎస్ఐ రమేష్ బాబు హెచ్చరిక



ప్యాపిలి నవంబర్ 13 (ప్రజా జ్యోతి న్యూస్) ప్యాపిలి మండలం నేరేడుచర్ల గ్రామంలో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాచర్ల ఎస్ఐ రమేష్ బాబు గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఓటు వేసిన అనంతరం కట్టల దగ్గర, చెట్ల దగ్గర గుంపులుగా కూర్చోకుండా నేరుగా తమ ఇళ్లకు వెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా గొడవలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరంగా తగిన సెక్షన్ల కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమేష్ బాబు హెచ్చరించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

హుసేనాపురంలో శ్రీశ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 418వ జయంతి వేడుకలు ఈ నవంబర్ 21న!!



ప్యాపిలి నవంబర్ 13 (ప్రజా జ్యోతి న్యూస్) హుసేనాపురం: గ్రామంలోని శ్రీశ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 418వ జయంతి వేడుకలను నవంబర్ 21వ తేదీ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి లక్ష్మయ్య స్వామి తెలిపారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పాలాభిషేకం, ఆకుపూజ నిర్వహించి, వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, ప్రసాదాల సమర్పణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అదేవిధంగా రాత్రి భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి లక్ష్మయ్య స్వామి తెలియజేశారు.

కామన్వెల్త్ కరాటే విజేతకు సీఎం చంద్రబాబు అభినందనలు



(ప్రజా జ్యోతి న్యూస్) నవంబర్ 13 ప్యాపిలి: కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఎం.వి. శ్రీ దినేష్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అభినందనలు తెలిపారు.శ్రీ దినేష్ ప్యాపిలి పిఈటి ఎం.సి.వి. రమణ సార్ మనవడు. కరాటేలో అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించి రాష్ట్రానికి, ప్యాపిలికి గర్వకారణంగా నిలిచాడు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు శ్రీ దినేష్‌ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. దీంతో ప్యాపిలి పట్టణంలో సంతోషం వ్యక్తమవుతోంది.

కౌతాళం ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించండి.. గ్రామ అభివృద్ధికి అండగా నిలుస్తాం!

కౌతాళం సర్పంచ్ అభ్యర్థి గాండ్ల శ్రీయ విజ్ఞప్తి

:-ముందుగా వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభం

:-మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చెన్నబసప్ప ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం

కౌతాళం, నవంబర్ 13 ప్రజా జ్యోతి మండల కేంద్రమైన కౌతాళంలో శుక్రవారం సర్పంచ్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది.కౌతాళం గ్రామ సర్పంచ్ అభ్యర్థి గాండ్ల శ్రీయ,మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చెన్నబసప్ప ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు ముందుగా కౌతాళంలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం గ్రామ ఆచార సంప్రదాయాలను అనుసరిస్తూ ముందుగా కురువ కుటుంబాన్ని సందర్శించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. అక్కడి నుంచి గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



రెండు కోట్ల రూపాయలతో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిస్తాం!

ఈ సందర్భంగా మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చెన్నబసప్ప, సర్పంచ్ అభ్యర్థి గాండ్ల శ్రీయ మాట్లాడుతూ.. తమ కుటుంబం కౌతాళం గ్రామానికి గతంలో ఎన్నో విధాలుగా సేవలు అందించిందని తెలిపారు. గ్రామ ప్రజల ఆశీర్వాదం, సహకారంతో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పించామని పేర్కొన్నారు.ముఖ్యంగా గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వస్తున్నామని తెలిపారు.సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.

గ్రామ అభివృద్ధే మా ప్రధాన లక్ష్యం!


గ్రామంలో తాగునీటి సమస్యతో పాటు డ్రైనేజీ రోడ్లు,వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామంలోని ప్రతి వీధిని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చే ప్రతి హామీని బాధ్యతగా తీసుకుని నెరవేర్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. పదవిని అధికారంగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తామని తెలిపారు.

మీ ఆశీర్వాదమే మా బలం.. మీ సహకారమే మా లక్ష్యం!

కౌతాళం గ్రామ ప్రజలు తమను ఆదరించి, ఆశీర్వదించి సర్పంచ్ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చెన్నబసప్ప,సర్పంచ్ అభ్యర్థి గాండ్ల శ్రీయ విజ్ఞప్తి చేశారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.కౌతాళం గ్రామ సమగ్ర అభివృద్ధి,ప్రజల సంక్షేమం,మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రధాన లక్ష్యమని వారు వెల్లడించారు.

ఏ రాష్ట్రానికి మైలేజ్.... తెలుగు రాష్ట్రాల్లో సమ్మిట్ కోలాహలం

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య పారిశ్రామిక పురోగతి, గ్లోబల్ పెట్టుబడుల సాధనలో సరికొత్త ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొంది. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు దాదాపు ఒకే సమయంలో మెగా పెట్టుబడుల సదస్సులను నిర్వహిస్తుండటం కార్పొరేట్ రంగాన్ని ఆకర్షిస్తోంది. తెలంగాణలోని ఎనుముల రేవంత్ రెడ్డి సర్కార్ హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా ప్రసిద్ధ భారత్ సమ్మిట్ 2026 ను నిర్వహిస్తుండగా.. అటు ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నవంబర్ విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ను ఎంతో వైభవంగా నిపుణులతో నిర్వహిస్తోంది. రెండు సదస్సుల లక్ష్యం ఒక్కటే?అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలను ఆకట్టుకుని వేల కోట్ల రూపాయల పెట్టుబడులను తమ వైపు తిప్పుకోవడమే.ఒకే సమయంలో ఇరు రాష్ట్రాల్లో సమ్మిట్‌లు జరగనుండటంతో సహజంగానే మీడియా, కార్పొరేట్ వర్గాల్లో పోలికలు తీవ్రమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కేంద్ర హోంమంత్రి పీయూష్ గోయల్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ బహుళజాతి కంపెనీల సీఈఓలు, దౌత్యవేత్తలు హాజరవుతున్నారు. సముద్ర తీర ప్రాంతం, డెస్టినీ సిటీ ఆధారంగా విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా ప్రతిపాదించి దాదాపు రూ. 11 లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు సర్కార్ వ్యూహాలు రచిస్తోంది. మరోవైపు, తెలంగాణ నిర్వహించే భారత్ సమ్మిట్‌లో 70కి పైగా దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, గ్లోబల్ పాలసీ మేకర్స్ పాల్గొంటున్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్లోబల్ ఈక్విటీ, సాంకేతికత, ఫ్యూచర్ సిటీ కాన్సెప్ట్‌లతో గ్లోబల్ బ్రాండ్‌లను ఆకర్షించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు.



హైదరాబాద్ ఇప్పటికే పొందిన ఐటీ అండ్ ఫార్మా గ్లోబల్ అడ్వాంటేజ్‌ను మరింత ముందుకు తీసుకెళ్తూ గ్రీన్ ఎనర్జీ, ఏఐ, స్పేస్ టెక్నాలజీ విభాగాలలో వేల కోట్ల పెట్టుబడులను సాధించడమే తెలంగాణ వ్యూహంగా ఉంది.ఈ రెండు సమ్మిట్‌ల పోలికలో మౌలిక సదుపాయాలు, ఎకోసిస్టమ్స్ ప్రధాన వ్యూహాత్మక భిన్నత్వాలుగా నిలుస్తున్నాయి. తెలంగాణ తన ప్రపంచ శ్రేణి హైదరాబాద్ నగర మౌలిక వసతులు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు , వేగవంతమైన అనుమతుల వ్యవస్థలను ప్రధాన ఆయుధాలుగా ఉపయోగిస్తుంటే.. ఆంధ్రప్రదేశ్ తన విస్తారమైన సముద్ర తీరం, పోర్టు ఆధారిత రవాణా, గ్రీన్ హైడ్రోజన్, స్పేస్ టెక్నాలజీ హబ్‌లను చూపుతూ మల్టీనేషనల్స్ కంపెనీలకు ఆకర్షణీయమైన ప్రాధాన్యతలను అందిస్తోంది. కార్పొరేట్ సంస్థల కోణంలో చూస్తే, ఈ రేసు ద్వారా రెండు రాష్ట్రాలకు పెట్టుబడులు రావడం దేశానికే ప్రయోజనకరంగా మారుతోంది. అయితే ఏ రాష్ట్రం ఎంత సులభతర వాణిజ్యం , సింగిల్ విండో విధానం , స్థిరమైన నిధులు అందిస్తుందనే అంశంపైనే ఒప్పందాల కార్యరూపం ఆధారపడి ఉంటుంది. పెట్టుబడుల సమ్మిట్ వేదికపై ఎవరి ఒప్పందాల సంఖ్య ఎంత, ఏ రాష్ట్రం అధిక గ్లోబల్ జెయింట్స్‌ను తమ భూభాగంలోకి ఆహ్వానిస్తుందో రాబోయే రోజుల్లో తేలాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న ఈ పెట్టుబడుల పోటీ రాజకీయ రంగానికి అతీతంగా అభివృద్ధికి కొత్త గమనకాలాన్ని ఇస్తోంది. విశాఖపట్నం పోర్టు లొకేషన్ బలం కాగా, హైదరాబాద్ ఆవిష్కరణల నెట్‌వర్క్ తెలంగాణకు అడ్వాంటేజ్. నవంబర్ రెండో వారంలో వెలువడే పెట్టుబడుల ఒప్పందాలు రాబోయే రోజుల్లో ఏపీ, తెలంగాణ రాజకీయ శ్రేణుల మైలేజ్‌ను శాసించే ప్రధాన కారకాలుగా నిలవబోతున్నాయని అనుకోవచ్చు.

ఉత్తర తెలంగాణలో పట్టు సాధించేది ఎలా

కరీంనగర్ : తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని ఆధిపత్యం చలాయించిన బీఆర్ఎస్, వరుస ఎన్నికల పరాజయాల తర్వాత డీలా పడింది. ఇప్పుడు తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా పార్టీకి కంచుకోటలుగా ఉన్న ఉత్తర తెలంగాణ జిల్లాలపై బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. 2004 నుంచి పార్టీకి బలమైన పునాదిగా ఉన్న ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో కోల్పోయిన పట్టును తిరిగి సాధించడం ఇప్పుడు బీఆర్ఎస్ ముందున్న అతిపెద్ద సవాలు.పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ఈ పునరుజ్జీవ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాలను సమీక్షించుకున్న తర్వాత, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తిరిగి ఉత్తేజపరిచేందుకు ఒక నెల రోజుల పాటు వరుస బహిరంగ సభలు, సమావేశాలకు ప్రణాళిక రూపొందించారు. గోదావరిఖనిలో జరిగిన సింగరేణి కార్మిక గర్జనతో మొదలైన ఈ రాజకీయ యాత్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని రైతు సదస్సుల మీదుగా సాగుతూ, నవంబర్ 29న కరీంనగర్‌లో నిర్వహించనున్న 'దీక్షా దివస్' వేదికలతో పతాక స్థాయికి చేరనుంది. కార్మికులు, రైతులు, తెలంగాణ ఉద్యమ సెంటి మెంట్ అనే మూడు ప్రధాన అంశాలను ఎంచుకోవడం ద్వారా, తమ సంప్రదాయ ఓటు బ్యాంకును తిరిగి ఆకట్టుకో వాలని బీఆర్ఎస్ భావిస్తోంది.అయితే.. ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్‌కు పరిస్థితులు అంత సులభంగా లేవు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం గులాబీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ. కేవలం ఎన్నికల ప్రచారాలకే పరిమితం కాకుండా, బీజేపీ తన సంస్థాగత బలాన్ని కూడా ఈ ప్రాంతంలో గణనీయంగా పెంచుకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కేంద్ర సహాయ మంత్రిగా ఉండటం వంటి అంశాలు బీజేపీకి క్షేత్రస్థాయిలో బలాన్ని చేకూర్చాయి.మరోవైపు, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా బీఆర్ఎస్ గట్టి పోటీని ఎదుర్కొంటోంది. గతంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేయడం ద్వారానే ఓట్లు రాబట్టవచ్చన్న వ్యూహం ఇప్పుడు ఫలించడం లేదు. సింగరేణి ప్రాంతంలో 18,000 మంది వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సాగునీరు అందించామని బీఆర్ఎస్ నేతలు పదేపదే ప్రస్తావిస్తున్నప్పటికీ, అవి ఎన్నికల్లో ఓట్లుగా మారలేదన్నది స్పష్టమైంది. రాజకీయాల్లో పాత విధేయతలు, గత చరిత్ర కేవలం ఒక ఆరంభం మాత్రమే అవుతాయి తప్ప, వాటినే శాశ్వత విజయాలకు గ్యారెంటీగా తీసుకోలేము. కార్యకర్తల్లో నెలకొన్న అసంతృప్తిని తొలగించడం, క్షేత్రస్థాయిలో బలహీనపడిన పార్టీ యంత్రాంగాన్ని పునర్నిర్మించడం, ఒకేసారి బీజేపీ, కాంగ్రెస్ వంటి రెండు బలమైన ప్రత్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కోవడం కేటీఆర్ ముందున్న తక్షణ కర్తవ్యాలు. గత పాలనా విజయాలను చెప్పుకోవడంతో పాటు, ప్రజల ప్రస్తుత సమస్యలపై పోరాడుతూ క్షేత్రస్థాయిలో తమ ఉనికిని బలంగా చాటుకున్నప్పుడే ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఈ నెల రోజుల కార్యాచరణ గులాబీ దళానికి నిజమైన అగ్నిపరీక్షగా మారనుంది.



సజ్జనార్ కు షాక్...

హైదరాబాద్ : తెలంగాణ పోలీసు శాఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ అనూహ్యమైన రీతిలో భారీ ప్రక్షాళనకు తెరలేపింది. ఒకేసారి 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జారీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో అత్యంత ప్రధానంగా చెప్పుకోవాల్సిన అంశం హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌కు ఎదురైన భారీ షాక్. అత్యంత కీలకమైన ఫోకల్ పోస్టు లో కొనసాగుతున్న 1996 బ్యాచ్ అధికారి సజ్జనార్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించి, ప్రాధాన్యత తక్కువగా ఉండే తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనర గా బదిలీ చేశారు. అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ బాధ్యతలు అప్పగించినప్పటికీ, సజ్జనార్ వంటి కీలక అధికారిని లూప్ లైన్ తరహా విభాగానికి పంపడం వెనుక ప్రభుత్వ అంతర్గత వ్యూహాలు బలంగా పనిచేశాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.మరోవైపు, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2001 బ్యాచ్ అధికారి అకున్ సబర్వాల్‌కు ప్రభుత్వం అత్యంత కీలకమైన పవర్‌ఫుల్ పోస్టింగ్ ఇచ్చి తన ప్రాధాన్యతను చాటుకుంది. అకున్ సబర్వాల్‌ను రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ గా నియమించడంతో పాటు, కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల అదనపు బాధ్యతలను కూడా అప్పగించింది. ఇక సజ్జనార్ స్థానంలో కొత్త హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా 1995 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి మహేష్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటివరకు శాంతిభద్రతల విభాగం డీజీపీగా పనిచేసిన ఆయన, గతంలో రాచకొండ కమిషనర్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవంతో ఇప్పుడు రాజధాని శాంతిభద్రతలను పర్యవేక్షించనున్నారు.ఈ ప్రక్షాళనలో భాగంగా అవినీతి నిరోధక శాఖ , నిఘా, ఆర్టీసీ, పౌరసరఫరాల విభాగాల్లోనూ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారిణి చారు సిన్హాను పూర్తిస్థాయి ఏసీబీ డీజీగా నియమిస్తూనే, సీఐడీ డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు కొనసాగించింది. మల్టీజోన్-1 ఐజీగా ఉన్న ఎస్. చంద్రశేఖర్ రెడ్డిని ఏసీబీ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. అలాగే గ్రేహౌండ్స్ ఆపరేషన్స్ డీజీపీగా ఉన్న డాక్టర్ అనిల్ కుమార్‌ను టీజీఎస్ఆర్టీసీ ఎండీగా నియమించగా, ఆర్టీసీ ఎండీగా ఉన్న వై. నాగిరెడ్డిని పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా మార్చింది. ఇక సివిల్ సప్లైస్ కమిషనర్‌గా ఉన్న ఎం. స్టీఫెన్ రవీంద్రను కొత్తగా ఏర్పాటైన తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా నియమించగా, మహిళా భద్రత విభాగం డీజీపీగా డాక్టర్ సౌమ్య మిశ్రా, జైళ్ల శాఖ డీజీగా స్వాతి లక్రా బాధ్యతలు చేపట్టనున్నారు.గ్రేహౌండ్స్ డీజీగా విక్రమ్ సింగ్ మాన్, మల్టీజోన్-1 ఐజీగా కార్తికేయ వంటి సమర్థులైన అధికారులను కీలక స్థానాల్లో నియమించడం ద్వారా రేవంత్ రెడ్డి సర్కార్ పోలీసు వ్యవస్థపై తన పట్టును మరింత బిగించినట్లయింది. త్వరలో జరగబోయే పాలనాపరమైన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనల నేపథ్యంలోనే ఈ భారీ మార్పులకు శ్రీకారం చుట్టినట్లు స్పష్టమవుతోంది. కొందరు అధికారులకు లూప్ లైన్ పోస్టింగ్‌లతో షాక్ ఇస్తూనే, అకున్ సబర్వాల్, మహేష్ భగవత్, చారు సిన్హా వంటి అధికారులకు కీలక విభాగాల పగ్గాలు అప్పగించడం ద్వారా రాష్ట్ర శాంతిభద్రతలు, అవినీతి నిరోధక చర్యల్లో ప్రభుత్వం సరికొత్త వేగాన్ని ఆశిస్తోందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

2028 జూన్ 2 నాటికి కోహెడ మార్కెట్

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రజల అవసరాలు, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. హైదరాబాద్ శివారులోని రంగారెడ్డి జిల్లా కోహెడలో ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని దాదాపు 239 ఎకరాల విశాలమైన స్థలంలో ఈ మార్కెట్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఆసియాలోనే అత్యంత ఆధునిక ప్రమా?ణాలతో కూడిన పండ్ల మార్కెట్‌గా దీనిని తీర్చిదిద్దుతున్నారు.తాజాగా ఈ ప్రాజెక్ట్ పురోగతిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీచించిన ఆయన, నిర్మాణ పనులకు సంబంధించి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. ఈ మెగా ప్రాజెక్ట్‌కు సంబంధించిన మొదటి దశ పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని, అలాగే 2028 జూన్ 2 నాటికి మొత్తం ప్రాజెక్ట్‌ను పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని, ఒకవేళ పనుల్లో జాప్యం జరిగితే కాంట్రాక్ట్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకునేలా నిబంధనలను సవరించాలని సూచించారు. అంతేకాకుండా, ఈ పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని కూడా ప్రభుత్వం నియమించింది.కొత్తపేట గడ్డిఅన్నారం మార్కెట్ స్థానంలో ప్రత్యామ్నాయంగా వస్తున్న ఈ కోహెడ మార్కెట్‌ను ఫ్రాన్స్‌లోని ప్రముఖ రంగిస్ మార్కెట్ తరహాలో అత్యున్నత వసతులతో డిజైన్ చేస్తున్నారు. పండ్ల నిల్వ కోసం అత్యాధునిక కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు, భారీగా విక్రయాలు జరిపేందుకు వీలుగా ట్రేడింగ్ హాళ్లు, దేశీయ, అంతర్జాతీయ రవాణాకు అనుకూలమైన రోడ్డు కనెక్టివిటీ వంటి సమగ్ర మౌలిక సదుపాయాలు ఇందులో కల్పిస్తున్నారు.ఈ మార్కెట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే తెలంగాణ రైతులు తమ ఉత్పత్తులను దేశ విదేశాలకు ఎగుమతి చేసుకునేందుకు గొప్ప వేదిక లభిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ప్రాజెక్ట్ సకాలంలో పూర్తయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో రైతులు, వ్యాపారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

హైదరాబాద్‌లో 3 కారిడార్లలో పీఆర్‌టీఎస్.

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను తగ్గించడం కోసం రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. మూడు ప్రధాన మార్గాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తేవడానికి ఆమోదం తెలిపింది. డిసెంబర్‌లోగా పనులు ప్రారంభించి.. 2027 చివరి నాటికి పీఆర్‌టీఎస్ సేవలు అందుబాటులోకి తేవాలని సీఎం రేవంత రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందులో కేపీహెచ్‌బీ నుంచి బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ (ప్రతిపాదిత) వరకు ఏర్పాటు చేయబోయే మార్గం కీలకం కానుంది.హైదరాబాద్ నగరంలోని ఐటీ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) మెట్రో స్టేషన్ నుంచి త్వరలో రానున్న బయోడైవర్సిటీ మెట్రోస్టేషన్ వరకు పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్‌టీఎస్) ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్ స్పేస్ మీదుగా బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ వరకు పీఆర్‌టీఎస్‌ను ఏర్పాటు చేయనున్నారు.హైదరాబాద్ నగరంలోని ఐటీ సంస్థలు ప్రధానంగా పశ్చిమ ప్రాంతంలోని హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో ఉన్నాయి. దీంతో ఐటీ ఉద్యోగులు ఎక్కువగా కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, నిజాంపేట్, బాచుపల్లి, చందానగర్ ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తు?న్నారు. మియాపూర్ నుంచి రాయదుర్గం వరకు మెట్రో సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే మెట్రోలో వెళ్లాలంటే చుట్టూ తిరుగుతూ అమీర్‌పేట మీదుగా 17 కి.మీ. ప్రయాణించాల్సి వస్తోంది. అంతే కాకుండా అమీర్‌పేటలో రైలు మారాలి. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో.. ఎక్కువ దూరం ప్రయాణించడం, రైలు మారాల్సి రావడం ఐటీ ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉంది. దీంతో చాలా మంది ఇప్పటికీ కార్లు, బైకుల, ట్యాక్సీల మీదే ఆఫీసులకు వెళ్తున్నారు. దీంతో గచ్చిబౌలి నుంచి కేపీహెచ్‌బీ వెళ్లే రూట్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది.పీఆర్‌టీఎస్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో డిసెంబర్ నాటికి టెండర్లు పూర్తి చేసి.. 2027 చివరి నాటికి పీఆర్‌టీఎస్‌ను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఏపీ పంచాయతీ ఎన్నికలు..

మూడు దశల్లో పోలింగ్

(ప్రజా జ్యోతి న్యూస్) నవంబర్ 13ప్యాపిలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 13,171 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.ఈ మూడు దశల పోలింగ్ వరుసగా ఈ నెల 26, 29, డిసెంబర్ 2వ తేదీల్లో జరగనుంది. మూడు దశల పంచాయతీ ఎన్నికలకు ఒకేసారి ఈ నెల 13న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.పెండింగ్‌లోని 23 పట్టణ స్థానిక సంస్థలకు పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చేస్తున్న కసరత్తు కొలిక్కి వచ్చింది.నోటిఫికేషన్ వెలువడడంతో ప్యాపిలి మండలంలోనూ పంచాయతీ ఎన్నికల వేడి మరింత పెరగనుంది.



బిజినెస్

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ జోరు

10 నెలల్లో రూ.44,305 కోట్ల ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు



హైదరాబాద్ నివాస గృహాల (రెసిడెన్షియల్) మార్కెట్ 2026 జనవరి నుంచి అక్టోబర్ కాలంలో స్థిరమైన పనితీరును కనబరిచింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ 'నైట్ ఫ్రాంక్ ఇండియా' విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. ఈ పది నెలల కాలంలో నగరంలో మొత్తం 61,033 నివాస ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.44,305 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే రిజిస్ట్రేషన్ల పరిమాణంలో 1 శాతం స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ, మొత్తం లావాదేవీల విలువలో మాత్రం 3 శాతం పెరుగుదల నమోదు కావడం విశేషం. మార్కెట్‌లో ఖరీదైన, ప్రీమియం ప్రాపర్టీల కొనుగోళ్లు పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. గత గణాంకాలను పరిశీలిస్తే, 2025 జనవరి--అక్టోబర్ కాలంలో హైదరాబాద్‌లో రూ.43,048 కోట్ల విలువైన 61,699 రెసిడెన్షియల్ ప్రాపర్టీలు రిజిస్టర్ కాగా, 2024 ఇదే కాలంలో రూ.40,078 కోట్ల విలువైన 65,280 ప్రాపర్టీలు నమోదయ్యాయి. ఇక 2026 అక్టోబర్ నెల విషయానికి వస్తే, నగరంలో రూ.4,395 కోట్ల విలువైన 5,318 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 2025 అక్టోబర్‌తో (6,194 ప్రాపర్టీలు) పోలిస్తే విక్రయాల పరిమాణం 14 శాతం, సెప్టెంబర్ 2026తో పోలిస్తే 5 శాతం తగ్గింది. లావాదేవీల విలువ కూడా వార్షిక ప్రాతిపదికన 3 శాతం, నెలవారీగా 2 శాతం తగ్గింది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 10 వరకు కొనసాగిన పితృపక్షాల సమయంలో సాధారణంగా కొనుగోలుదారులు కొత్త ప్రాపర్టీ లావాదేవీలను వాయిదా వేసుకోవడమే అక్టోబర్ మందగమనానికి ప్రధాన కారణమని నివేదిక స్పష్టం చేసింది. ఈ నివేదిక హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని ప్రైమరీ, సెకండరీ మార్కెట్ లావాదేవీలను పరిగణనలోకి తీసుకుని రూపొందించబడింది. నైట్ ఫ్రాంక్ ఇండియా ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శిశిర్ బైజల్ ఈ పరిణామాలపై స్పందిస్తూ.. "2026 జనవరి-అక్టోబర్ కాలంలో హైదరాబాద్ నివాస గృహాల మార్కెట్ లావాదేవీల పరిమాణం పరంగా స్థిరంగా కొనసాగింది. అదే సమయంలో నమోదైన లావాదేవీల విలువలో వార్షికంగా 3 శాతం వృద్ధి నమోదైంది. మార్కెట్ ధోరణిలో వస్తున్న మార్పును ఇది స్పష్టంగా సూచిస్తోంది. ముఖ్యంగా అధిక విలువ కలిగిన ప్రీమియం గృహాలు మొత్తం లావాదేవీల విలువను గణనీయంగా పెంచుతున్నాయి. అక్టోబర్ నెలలో పితృపక్షాల కారణంగా రిజిస్ట్రేషన్లు కొంత మందగించినప్పటికీ, మార్కెట్ వృద్ధి అనేది రిజిస్ట్రేషన్ల సంఖ్యతో పాటు ప్రాపర్టీల సేల్స్ వ్యాల్యూ ద్వారా సానుకూలంగా సాగుతోంది" అని వివరించారు. బడ్జెట్ విభాగాల వారీగా పరిశీలిస్తే, 2026 జనవరి-అక్టోబర్ కాలంలో రూ.50 లక్షల లోపు ధర ఉన్న ఇళ్లే రిజిస్ట్రేషన్లలో అత్యధిక వాటా (సుమారు 55 శాతం) దక్కించుకున్నాయి. రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి లోపు ఉన్న ఇళ్లు 25 శాతం వాటాను, రూ.1 కోటికి పైబడిన ఇళ్లు 20 శాతం వాటాను నమోదు చేశాయి. అయితే, మొత్తం లావాదేవీల విలువలో మాత్రం రూ.1 కోటికి పైబడిన లగ్జరీ ఇళ్లే ఆధిపత్యం చెలాయించాయి. 2026 పది నెలల కాలంలో నమోదైన మొత్తం విలువలో ఈ ప్రీమియం విభాగం వాటా ఏకంగా 51 శాతంగా (గతేడాది 50 శాతం) ఉంది. ఈ కేటగిరీ రిజిస్ట్రేషన్లు 12,246 నుంచి 12,322కి పెరగగా, వీటి మొత్తం విలువ రూ.21,475 కోట్ల నుంచి 6 శాతం వృద్ధితో రూ.22,680 కోట్లకు చేరింది. మరోవైపు, ?50 లక్షల లోపు ఇళ్ల రిజిస్ట్రేషన్లు 34,062 నుంచి 2 శాతం తగ్గి 33,420కి చేరాయి. వీటి లావాదేవీల విలువ మాత్రం రూ.10,710 కోట్ల నుంచి స్వల్పంగా పెరిగి రూ.10,751 కోట్లుగా నమోదైంది. రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి మధ్య ఉన్న విభాగంలో రిజిస్ట్రేషన్లు 15,391 నుంచి 15,289కి (1 శాతం తగ్గుదల), లావాదేవీల విలువ రూ.10,862 కోట్ల నుంచి రూ.10,768 కోట్లకు తగ్గాయి. అక్టోబర్ నెలలో ప్రీమియం విభాగం మరింత బలంగా కనిపించింది. అక్టోబర్‌లో నమోదైన మొత్తం విలువలో రూ.1 కోటి పైబడిన ఇళ్ల వాటా ఏకంగా 59 శాతంగా నమోదైంది.

అమెరికాలో ఇళ్ల అమ్మకాలు డౌన్..

16 ఏళ్ల కనిష్టానికి విక్రయాలు.. ధరలు మాత్రం పైపైకే!

అక్టోబర్‌లో 5.5% మేర తగ్గిన విక్రయాలు

అమ్మకాలు తగ్గినా ఆగని ధరల పెరుగుదల.. వరుసగా 40వ నెలలోనూ పైపైకే

2000 సంవత్సరం తర్వాత గరిష్ఠ స్థాయికి చేరిన మార్ట్‌గేజ్ వడ్డీ రేట్లే ప్రధాన కారణం

వడ్డీ రేట్లు తగ్గితే డిమాండ్ భారీగా పుంజుకుంటుందని నిపుణుల అంచనా



అమెరికాలో గృహ విక్రయ రంగం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మార్ట్‌గేజ్ వడ్డీ రేట్లు రికార్డు స్థాయిలో పెరగడంతో ఇళ్ల అమ్మకాలు గత 16 ఏళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. అయితే, అమ్మకాలు భారీగా తగ్గినప్పటికీ, ఇళ్ల ధరలు మాత్రం పైపైకే వెళ్తుండటం గమనార్హం. ఈ వింత పరిస్థితి కొనుగోలుదారులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ (ఎన్ఏఆర్) గురువారం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. అక్టోబర్‌లో పాత ఇళ్ల అమ్మకాలు సెప్టెంబర్‌తో పోలిస్తే 5.5% తగ్గి, వార్షిక రేటు 3.75 మిలియన్లకు పడిపోయాయి. గత ఏడాది అక్టోబర్‌తో పోలిస్తే ఇది 8.8% తక్కువ. 2010 ఆగస్టు తర్వాత ఇదే అత్యంత తక్కువ అమ్మకాల రేటు కావడం గమనార్హం. ఒకవైపు అమ్మకాలు పడిపోతున్నా, మరోవైపు ధరలు తగ్గకపోవడం మార్కెట్‌లో నెలకొన్న విచిత్ర పరిస్థితిని తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఇళ్ల సగటు ధర గత ఏడాదితో పోలిస్తే 0.4% పెరిగి 416,700 డాలర్లకు చేరింది. ఇలా ధరలు పెరగడం ఇది వరుసగా 40వ నెల. ఈ పరిస్థితిపై ఎన్ఏఆర్ చీఫ్ ఎకానమిస్ట్ లారెన్స్ యున్ స్పందిస్తూ.. "2000 సంవత్సరం తర్వాత మార్ట్‌గేజ్ వడ్డీ రేట్లు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. అందుకే ఇల్లు కొనడం చాలా కష్టంగా మారింది. ఫలితంగా, అమ్మకాలు దశాబ్దకాలంలో కనిష్ట స్థాయికి చేరాయి" అని వివరించారు. దేశంలోని మిడ్‌వెస్ట్, సౌత్, వెస్ట్ ప్రాంతాల్లో అమ్మకాలు క్షీణించగా, నార్త్ ఈస్ట్‌లో స్థిరంగా ఉన్నాయి. అమ్మకాలు మందగించడంతో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఇళ్ల సంఖ్య (ఇన్వెంటరీ) పెరిగింది. ప్రస్తుతం 1.59 మిలియన్ల ఇళ్లు అమ్మకానికి ఉన్నాయి. ఇది 5.1 నెలల సప్లైకి సమానం. అయితే, సప్లై పెరిగినప్పటికీ ధరలు తగ్గకపోవడానికి బలమైన కారణం ఉందని నిపుణులు అంటున్నారు. ఇప్పటికే ఇళ్లు ఉన్న యజమానులు ఆర్థికంగా బలంగా ఉన్నారని, ఆస్తుల విలువ పెరగడంతో వారు తక్కువ ధరలకు అమ్మడానికి ఇష్టపడటం లేదని లారెన్స్ యున్ తెలిపారు. మొత్తం లావాదేవీలలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా అమ్మిన ఇళ్లు కేవలం 2% మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో మార్ట్‌గేజ్ వడ్డీ రేట్లు తగ్గితే, ఇల్లు కొనాలని వేచి చూస్తున్న వారి నుంచి భారీ డిమాండ్ (పెంట్-అప్ డిమాండ్) పుంజుకునే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. ప్రస్తుతం మాత్రం అధిక ధరలు, వడ్డీ రేట్ల కారణంగా కొనుగోలు శక్తి అన్ని ప్రాంతాల్లోనూ గణనీయంగా తగ్గిందని అన్నారు.

మైక్రోసాఫ్ట్ 365 సేవల్లో అంతరాయం..

5 గంటలు స్తంభించిన వివిధ అప్లికేషన్లు



న్యూయార్క్: మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. మైక్రోసాఫ్ట్ 365 కింద పనిచేసే వివిధ అప్లికేషన్లు మొరాయించాయి. గురువారం సుమారు 5 గంటల పాటు ఔట్‌లుక్, టీమ్స్‌తో పాటు ఇతర కొన్ని అప్లికేషన్లు స్తంభించిపోయాయి. దీంతో వేలాది మంది మైక్రోసాఫ్ట్ 365 అప్లికేషన్ యూజర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓపెన్‌ఏఐతో పాటు ఆంథ్రోపిక్ సేవలకు కూడా మైక్రోసాఫ్ట్ వల్ల అవరోధాలు కలిగాయి. అయితే సేవలు నిలిచిపోయిన సర్వర్లను రిస్టోర్ చేసేందుకు మైక్రోసాఫ్ట్ వర్క్ చేస్తున్నట్లు తెలిసింది. యూజర్లు మెల్లమెల్లగా తమ సర్వీసులకు కనెక్ట్ అవుతున్నారని కంపెనీ తాజాగా తన రిపోర్టులో చెప్పింది. డౌన్‌డిటెక్టర్ ప్రకారం .. ఔట్‌లుక్ సేవల్లో గురువారం మధ్యాహ్నం తీవ్ర స్థాయిలో అంతరాయం ఏర్పడినట్లు తెలిసింది. అయితే సాయంత్రం వరకు ఆ సమస్య తగ్గింది. మైక్రోసాఫ్ట్ 365కి సంబంధించిన ఇష్యూలు అన్నీ నిన్న సాయంత్రం వరకు గణనీయంగా తగ్గినట్లు కంపెనీ చెప్పింది. టీమ్స్‌ను యాక్సెస్ చేసేందుకు కూడా యూజర్లకు కొంత సమయం పట్టింది. సర్వర్లపై ఒకేసారి అధిక లోడు పడడం వల్ల సేవల్లో అవరోధాలు ఎదురైనట్లు మైక్రోసాఫ్ట్ చెప్పింది. మైక్రోసాఫ్ట్ 365 సర్వీసుల్లో సమస్యలు ఎదుర్కొంటున్న యూజర్ల రిపోర్టులపై దర్యాప్తు చేస్తున్నట్లు కంపెనీ పేర్కొన్నది. ప్రభావానికి గురైన సర్వర్లను మళ్లీ ఆన్‌లైన్‌లోకి తెచ్చే ఏర్పాట్లు జరుగుతున్నట్లు కంపెనీ వెల్లడించింది. కెపాసిటీని రిస్టోర్ చేశామని, యూజర్లు నెమ్మదిగా రికవరీ అవుతారని మైక్రోసాఫ్ట్ తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నది.

నాలుగో వన్డేలో భారత్‌కు ఘోర పరాజయం..

244 పరుగులతో న్యూజిలాండ్ చారిత్రక విజయం!

334 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా

89 పరుగులకే టీమిండియా ఆలౌట్

తొలి ఓవర్‌లోనే రోహిత్, కోహ్లీ, అయ్యర్ ఔట్

27 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టిన మాట్ హెన్రీ

ఆదివారం జరిగే ఐదో వన్డే నిర్ణయాత్మకం



న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో భారత బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బ తీశాడు. మొత్తంగా 27 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి కెరీర్‌లోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. దీంతో నాలుగో వన్డేలో న్యూజిలాండ్ 244 పరుగుల భారీ తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. 334 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 89 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 2-1కి తగ్గింది. ఆదివారం ఇదే మైదానంలో జరిగే చివరి మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయించనుంది. ఒక్క పరుగు కూడా చేయకముందే భారత జట్టు పతనం మొదలైంది. హెన్రీ వేసిన తొలి బంతికే ఫిన్ అలెన్‌కు క్యాచ్ ఇచ్చి రోహిత్ శర్మ వెనుదిరిగాడు. ఆ తర్వాత నాలుగో బంతికి విరాట్ కోహ్లీ బౌల్డ్ అయ్యాడు. హెన్రీ అదే ఊపులో ఓ చక్కని ఇన్‌స్వింగర్‌తో శ్రేయస్ అయ్యర్‌ను ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు పంపాడు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా.. రివ్యూలో నిర్ణయం న్యూజిలాండ్‌కు అనుకూలంగా వచ్చింది. భారత వన్డే క్రికెట్ చరిత్రలో రోహిత్, కోహ్లీ ఒకే మ్యాచ్‌లో డకౌట్ కావడం ఇది రెండోసారి. ఆ తర్వాత రుతురాజ్ గైక్వాడ్ (5)ను కైల్ జేమీసన్ ఔట్ చేయడంతో భారత్ 9 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. 1983 ప్రపంచకప్‌లో జింబాబ్వేతో మ్యాచ్‌లోనూ భారత్ ఇదే దశలో 9/4తో నిలిచింది. అప్పట్లో కపిల్ దేవ్ అద్భుతంగా ఆడి 175 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ఈసారి మాత్రం అలాంటి ఇన్నింగ్స్ ఆడేవారు కరవయ్యారు. అక్షర్ పటేల్ (21), ఇషాన్ కిషన్ (27) ఐదో వికెట్‌కు 70 బంతుల్లో 44 పరుగులు జోడించి జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ సాధించి పెట్టే ప్రయత్నం చేశారు. అయితే అక్షర్‌ను మాథ్యూ ఫిషర్ వెనక్కి పంపాడు. రెండో స్పెల్‌కు వచ్చిన హెన్రీ.. తన తొలి బంతికే ఇషాన్‌ను బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత 143 కిలోమీటర్లకు పైగా వేగంతో వేసిన బౌన్సర్‌తో ఫిషర్.. ఆకిబ్ నబీని పెవిలియన్‌కు పంపాడు. కుల్దీప్ యాదవ్‌ను బౌల్డ్ చేయడంతో హెన్రీ ఐదు వికెట్లు పూర్తి చేసుకున్నాడు. నమన్ ధీర్ (21) కాసేపు ఎదురుదాడికి దిగాడు. ఫిషర్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాదినా.. చివరకు ఎక్స్‌ట్రా కవర్‌లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. గుర్నూర్ బ్రార్‌ను బౌల్డ్ చేయడంతో హెన్రీ భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు. ఫిషర్ మూడు వికెట్లు పడగొట్టగా.. జేమీసన్ ఆరు ఓవర్లలో కేవలం 12 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీశాడు. ఏడాది విరామం తర్వాత వన్డేల్లో బరిలోకి దిగిన హెన్రీ మాత్రం భారత బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. అంతకుముందు న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 333 పరుగులు చేసింది. విల్ యంగ్ (125) శతకంతో చెలరేగగా.. టిమ్ సీఫెర్ట్ (58) అర్ధశతకంతో రాణించాడు. అక్షర్ పటేల్ రెండు వికెట్లు తీయగా.. ఆకిబ్ నబీ కూడా రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో ఆదివారం జరిగే నిర్ణయాత్మక మ్యాచ్‌పై ఆసక్తి పెరిగింది.

తనను ఔట్ చేసిన బౌలర్‌కు కోహ్లీ అరుదైన బహుమతి..



మైదానంలో ప్రత్యర్థులుగా తలపడినా.. ఆట ముగిశాక పరస్పరం గౌరవించుకోవడంలో టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ ఎప్పుడూ ముందుంటాడు. న్యూజిలాండ్‌తో నాలుగో వన్డేలో భారత బ్యాటింగ్ పతనానికి కారణమైన కివీస్ పేసర్ మాట్ హెన్రీకి తన జెర్సీని బహుమతిగా ఇచ్చి మరోసారి క్రీడాస్ఫూర్తిని చాటాడు. మౌంట్ మాంగనూయిలోని బే ఓవల్ వేదికగా శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో హెన్రీ నిప్పులు చెరిగే బంతులతో భారత్‌ను దెబ్బతీశాడు. తన వన్డే కెరీర్‌లోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేస్తూ 27 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్‌లను డకౌట్ చేశాడు. వన్డేల్లో భారత్ తొలి 3 వికెట్లను పరుగులేమీ చేయకుండానే కోల్పోవడం ఇదే తొలిసారి. హెన్రీ బౌలింగ్‌లో నాలుగు బంతులాడి డకౌటైన కోహ్లీ.. మ్యాచ్ అనంతరం అతడిని అభినందించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న హెన్రీని కలిసి తన టీమిండియా జెర్సీని అందించాడు. ఇద్దరూ చిరునవ్వులు చిందిస్తూ మ్యాచ్ గురించి కాసేపు మాట్లాడుకున్నారు. కోహ్లీని హెన్రీ ఐదో బంతికి క్లీన్‌బౌల్డ్ చేశాడు. తొలుత బయటకు వెళ్లేలా బంతులు వేసిన అతడు.. ఆ తర్వాత లోపలికి దూసుకొచ్చే బంతితో కోహ్లీని బోల్తా కొట్టించాడు. అనంతరం శ్రేయస్ అయ్యర్‌ను రివ్యూ ద్వారా ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (27), అక్షర్ పటేల్ (21), నమన్ ధీర్ (21) కొంత పోరాడినా భారత్ లక్ష్యం దిశగా సాగలేకపోయింది.

స్పోర్ట్స్

ఎవరూ కావాలని వికెట్ పారేసుకోలేదు



కొత్త బంతితో న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ కనబరిచిన అద్భుతమైన లైన్ అండ్ లెంగ్తే మ్యాచ్ ఫలితాన్ని శాసించిందని భారత తాత్కాలిక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశాడు. బే ఓవల్ వేదికగా జరిగిన నాలుగో వన్డేలో భారత జట్టు 89 పరుగులకే కుప్పకూలి, 244 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైన అనంతరం అయ్యర్ మాట్లాడారు. ప్రత్యర్థి బౌలర్ హెన్రీ అసాధారణ ప్రదర్శనను ప్రశంసించడంతో పాటు మ్యాచ్‌లో చోటుచేసుకున్న పరిణామాలను విశ్లేషించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెజెంటేషన్ కార్యక్రమంలో శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. పిచ్ ప్రవర్తించిన తీరుపై కీలక వ్యాఖ్యలు చేశాడు. "మొదటి ఇన్నింగ్స్‌కు, రెండో ఇన్నింగ్స్‌కు మధ్య పిచ్ పరిస్థితుల్లో చాలా పెద్ద తేడా కనిపించింది. అయితే ఎవరికి దక్కాల్సిన గుర్తింపు వారికి కచ్చితంగా ఇవ్వాలి. హెన్రీ తొలి బంతి నుంచే సరైన ప్రదేశాల్లో బంతులు విసిరిన తీరు నిజంగా అద్భుతం. మొదటి ఇన్నింగ్స్‌లో కివీస్ బ్యాటర్లు బంతి పైకి లేస్తున్న సమయంలో కూడా చక్కగా షాట్లు ఆడారు. ఆ తర్వాత వారు 330కి పైగా పరుగులు చేయడంతో ఇది బ్యాటింగ్‌కు అనుకూలమైన వికెట్ అని మేము భావించాం. ఫీల్డింగ్‌లో ఒకట్రెండు క్యాచ్‌లు చేజారినప్పటికీ, ఆటలో అవి సహజమే" అని అయ్యర్ పేర్కొన్నాడు. లక్ష్య ఛేదనలో ఎదురైన ఇబ్బందుల గురించి చెబుతూ.. "తొలి ఇన్నింగ్స్ చూసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నాం. ఈ లక్ష్యాన్ని సులువుగానే ఛేదించగలమని అనుకున్నాం. కానీ రెండో ఇన్నింగ్స్‌లో బంతి ఊహించని రీతిలో లోపలికి, బయటకు సీమ్ అయింది. అలాంటి పరిస్థితుల్లో క్రీజులో ఎలా ఆడాలో బ్యాటర్లకు అర్థం కాలేదు. మా బ్యాటర్లు ఎవరూ కావాలని వికెట్ పారేసుకోలేదు. కివీస్ పేసర్లు విసిరిన అత్యుత్తమ డెలివరీలకే వికెట్లు పడ్డాయి" అని శ్రేయస్ అయ్యర్ వివరించారు. ఈ మ్యాచ్‌లో కివీస్ పేసర్ మ్యాట్ హెన్రీ ఆరంభంలోనే టీమిండియాను కోలుకోలేని దెబ్బతీశాడు. భారత్ ఇంకా ఖాతా తెరవకముందే.. తొలి ఓవర్లోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను పెవిలియన్ పంపాడు. ఆ ఓవర్ చివరి బంతికి శ్రేయస్ అయ్యర్‌ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి టీమిండియా నడ్డి విరిచాడు. అనంతరం నిప్పులు చెరిగిన హెన్రీ 6 వికెట్లు తీసి కేవలం 27 పరుగులు మాత్రమే ఇచ్చి తన కెరీర్ అత్యుత్తమ గణాంకాలను నమోదు చేశాడు. ఈ పరాజయం భారత్‌ను పలు ప్రతికూల రికార్డుల్లో నిలిపింది. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత పవర్‌ప్లేలో భారత్ నమోదు చేసిన అత్యల్ప స్కోరు (26/4) ఇదే కావడం గమనార్హం. అంతేకాకుండా పరుగుల పరంగా వన్డే క్రికెట్ చరిత్రలో భారత్‌కు ఇది రెండో అతిపెద్ద పరాజయంగా నమోదైంది. ఈ ఓటమితో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 2-1కి తగ్గింది. అయితే ఈ పరాజయాన్ని వీలైనంత త్వరగా మర్చిపోవాల్సిన అవసరం ఉందని శ్రేయస్ అయ్యర్ అన్నాడు. "ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఎక్కడ లోపాలు జరిగాయో విశ్లేషించుకుని, ఈ ఫలితాన్ని పక్కన పెట్టడం చాలా ముఖ్యం. సిరీస్‌లో ఇప్పటికే మేము రెండు మ్యాచ్‌లు గెలిచామన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. దాని నుంచి సానుకూల అంశాలను తీసుకుని, సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌కు సరికొత్త ఉత్సాహంతో బరిలోకి దిగుతాం" అని స్పష్టం చేశాడు. సిరీస్ విజేతను తేల్చే ఐదో వన్డే ఆదివారం ఇదే బే ఓవల్ మైదానంలో జరగనుంది.



త్రిగుణ్ 'జంగా' గ్లింప్స్ విడుదల..

రా అండ్ రస్టిక్ లుక్‌లో అదరగొట్టిన హీరో!

శ్రీమతి వనిత కిలారి సమర్పణలో ఆర్‌కె ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై రమ్య కిలారి, జయచంద్ర నాయుడు కిలారి నిర్మిస్తున్న సరికొత్త చిత్రం 'జంగా'. కెవిన్ గద్దం (శ్రీహరి) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను ప్రముఖ దర్శకులు రాంగోపాల్ వర్మ తాజాగా విడుదల చేశారు. త్రిగుణ్ కెరీర్‌లో ఇది సరికొత్త మైలురాయిగా నిలవనుందని ఈ గ్లింప్స్ చూస్తే స్పష్టమవుతోంది. ఈ చిత్రంలో త్రిగుణ్ సరసన నేహా పఠాన్ నటించగా, వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్, గగన్ విహారి, చందు గౌడ, సమీర్, నాగ మహేష్, భూపాల్ రాజు, రఘు కారుమంచి, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కొన్ని లక్షల ఏండ్లు పట్టింది.. పశువు మనిషి అవ్వడానికి.. మళ్లీ పశువు అవుతానంటే నేను ఒప్పుకోను.. మనిషి పశువు అయితే.. మరణం వదం అయితాది' అంటూ త్రిగుణ్ చెప్పిన శక్తివంతమైన డైలాగ్స్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నాయి. రా అండ్ రస్టిక్ లుక్‌లో త్రిగుణ్ కనిపిస్తుండగా, మరోవైపు వరలక్ష్మీ శరత్ కుమార్ కూడా పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించి ఆకట్టుకుంటున్నారు. మానవ భావోద్వేగాలు, పుట్టుక-చావుల మధ్య ఉండే సంక్లిష్టతలు, ఆధ్యాత్మిక కోణాలను స్పృశిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు కృష్ణ సౌరభ్ సంగీతం అందిస్తుండగా, వెంకట్ సి. దిలీప్ కెమెరామెన్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రసాద్ వర్మ, ప్రేమ్ రాజ్ మాటలు అందిస్తుండగా, కాసర్ల శ్యాం, పూర్ణాచారి, కళ్యాణ్ చక్రవర్తి పాటలు రాస్తున్నారు. విభిన్న కథాంశంతో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు రానుందనే దానిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.

వారణాసి మూవీ.. వాయిదా పడే ఛాన్స్!

మహేశ్ బాబు- రాజమౌళి కాంబోలో వస్తోన్న మోస్ట్ అడ్వెంచరస్ మూవీ వారణాసి. వీరిద్దరి కాంబోలో వస్తోన్న తొలి చిత్రం కావడంతో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా కనిపించనుంది. మలయాళ సూపర్‌స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుందని ఇప్పటికే ప్రకటించారు. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్‌కు సంబంధించిన ఓ టాక్ వైరల్‌గా మారింది. వారణాసి వాయిదా పడనుందనే వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ముందుగా ప్రకటించిన తేదీకి రాకపోవచ్చని లేటెస్ట్ టాక్. వచ్చే ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు వచ్చే ఛాన్స్ ఉందని నెట్టింట ప్రచారం జరుగుతోంది. మహేశ్ బాబు బర్త్ డే ఆగస్టు 9న కావడంతో అదే నెలలో విడుదలకు ప్లాన్ చేస్తున్నారని రూమర్స్ వినిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే మహేశ్ బాబు ఫ్యాన్స్‌కు డబుల్ బొనాంజా లభించనుంది. బర్త్ డేతో పాటు వారణాసి మూవీని సెలబ్రేట్ చేసుకునే ఛాన్స్ అభిమానులకు దక్కనుంది. కాగా..ఈ చిత్రంలో మహేష్ బాబు రుద్ర పాత్రలో కనిపించనున్నారు. రామాయణ ఎపిసోడ్‌లో కాసేపు శ్రీరాముడిగానూ కనువిందు చేయనున్నారు. ప్రియాంక చోప్రా మందాకిని పాత్ర పోషిస్తుండగా.. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభగా కనిపించనున్నారు.





టాలీవుడ్‌లో మరో వాయిదా..

రష్మిక 'మైసా' రిలీజ్ డేట్ మారనుందా?

టాలీవుడ్‌లో సినిమాల వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే పలు భారీ చిత్రాలు అనుకున్న తేదీలకు రాలేకపోతుండగా, తాజాగా ఆ జాబితాలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ మూవీ 'మైసా' కూడా చేరినట్లు ఫిలిం నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో రష్మిక తొలిసారిగా ఒక గిరిజన యువతిగా మైసా అనే ఛాలెంజింగ్ పాత్రలో కనిపించనున్నారు. తన జాతికి జరిగిన అన్యాయంపై పోరాడే ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ కూడా తీసుకున్నారు. డూప్ లేకుండా రిస్కీ ఫైట్ సీక్వెన్స్‌లలో నటించినట్లు ఇటీవల విడుదలైన టీజర్ ద్వారా స్పష్టమైంది. రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రష్మిక కెరీర్‌లోనే బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్‌గా మారుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, ముందుగా ఈ సినిమాను నవంబర్ 27న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఆలస్యం కావడంతో ఈ విడుదల తేదీ మారే అవకాశం ఉందని తెలుస్తోంది. నవంబర్ 27కి బదులుగా సరిగ్గా వారం రోజులు ఆలస్యంగా డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర యూనిట్ యోచిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే దీనిపై సినిమా నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం వ్యక్తిగత కారణాల వల్ల విదేశీ టూర్‌లో ఉన్న రష్మిక, ఆ ప్రయాణం ముగిసిన వెంటనే సినిమా ప్రమోషన్లలో వేగం పెంచనున్నారు. రావు రమేష్, సముద్రఖని, గురు సోమసుందరం, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.

100 అడుగుల క్రేన్ నా కళ్లముందే.. భయంతో వణికిపోయా

సినిమా చూడటానికి తెరపై అందంగానే ఉంటుంది. కానీ తెర వెనక చాలా కష్టంతో పాటు అప్పుడప్పుడు ప్రమాదాలూ జరుగుతుంటాయి. కమల్ హాసన్ 'ఇండియన్ 2' షూటింగ్ సందర్భంగా అలాంటి ఓ ఘోర ప్రమాదం జరిగి ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. అయితే తాను ఆ ప్రమాదంలో చనిపోయేదాన్ని అని చెప్పిన కాజల్.. ఎలా బతికి బయటపడ్డానో తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. 'వారం క్రితం సింగపూర్‌లోని నా మైనపు విగ్రహావిష్కరణ జరిగింది. అందులో పాల్గొని తిరిగి ఇండియన్ 2(భారతీయుడు 2) షూటింగ్ కోసం చెన్నై వచ్చాను. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే యాక్షన్ సీన్స్ రాత్రిపూట తీస్తున్నారు. నేను 80ఏళ్ల మహిళగా మేకప్‌లో ఉన్నా. సాధారణంగా మా సీన్స్ లేకపోతే మానిటర్ దగ్గర కూర్చుని చూస్తుంటాం. కానీ ఆ రోజు అక్కడ కూర్చోలేదు. నడుచుకుంటూ ముందుకు వెళ్తుంటే, ఉన్నట్టుండి 100 అడుగుల భారీ క్రేన్ నా కళ్ల ముందే కూలిపోయింది. నా మీద కూడా క్రేన్ పడిపోయిందేమో అనుకున్నా' 'మొదట నేను చనిపోయేదాన్ని. కానీ ఎవరో నన్ను చేయిపట్టుకుని వెనక్కి లాగారనిపించింది. కళ్ల ముందే ప్రమాదం జరగడంతో భయంతో వణికిపోయాను. కదలకుండా ?అక్కడే ఉండిపోయాను. ఒక్కసారి తేరుకుని అందరితో కలిసి పరిగెత్తడం మొదలుపెట్టాను. ఆ సంఘటన తలుచుకుంటే ఇప్పటికీ ఒళ్లు జలదరిస్తుంది. దేవుడి దయ వల్లే ప్రాణాలతో బయటపడ్డాను. అప్పటి నుంచి కృష్ణుడి భక్తురాలిగా మారిపోయా' అని కాజల్ సదరు ప్రమాదం గురించి చెప్పుకొచ్చింది. 'ఇండియన్ 2' విషయానికొస్తే చాలా కష్టాలుపడి 2024లో థియేటర్లలో రిలీజైంది. నిర్మాతకు ఘోరమైన నష్టాలు మిగిల్చింది. దర్శకుడు శంకర్ కూడా దారుణమైన విమర్శలు ఎదుర్కొన్నారు. అప్పటినుంచి శంకర్ మరో కొత్త మూవీ చేయలేదు. ప్రస్తుతం 'ఇండియన్ 3' షూటింగ్ జరుగుతోంది. వచ్చే ఏడాది దీని రిలీజ్ ఉండే అవకాశముంది.



Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,